ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -169 పేజీలు - 8 వెల ₹03/- ఆదివారం 27 సెప్టెంబర్ 2026

సీఈసీ రాజీనామా చేయాల్సిందే

: ఈసీ ప్రెస్ నోట్‌పై కాంగ్రెస్ ఫైర్



ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణపై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు

యువతను లక్ష్యంగా చేసుకుని జాబితాల నుంచి పేర్లు తొలగిస్తున్నారని ధ్వజం

ఢిల్లీ సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్):
భారత ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ**మిగతా 2లో...**

కాళేశ్వరం పునరుద్ధరణకు రంగం సిద్ధం

నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం

2027 వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు : అధికారులు

భద్రత, నాణ్యతలో రాజీ లేదన్న మంత్రి ఉత్తమ్



హైదరాబాద్ సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్):
కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన **మిగతా 2లో...**

నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే

ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్



ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ

నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు

ఓటర్ల సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి

పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు

ఈసీఐనెట్ పోర్టల్‌పై సమీక్షకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

ఢిల్లీ సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్):
భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి **మిగతా 2లో...**

10 శాతం వృద్ధి సాధ్యమే

: టెక్నాలజీపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు



రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

హైదరాబాద్ సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్):
సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు.తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, **మిగతా 2లో...**



కబడ్డీలో భారత్ డబుల్ గోల్డ్

పురుషుల, మహిళల ఫైనల్స్‌లో ఇరాన్‌పై ఘన విజయం

ఒకే రోజు కబడ్డీలో స్వర్ణాలు సాధించిన మహిళల, పురుషుల జట్లు

గత టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్న భారత జట్లు





ఢిల్లీ సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్): ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలతో మెరిశాయి. నేడు జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్స్‌లో పురుషుల, మహిళల జట్లు రెండూ ఇరాన్‌ను ఓడించి తమ టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్నాయి. దీంతో భారత కబడ్డీ ఒకే రోజు రెండు స్వర్ణాలను ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకుంది.పురుషుల ఫైనల్ ఆద్యంతం హోరాహోరీగా సాగింది. **మిగతా 2లో...**

కర్నూలును ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు

రాష్ట్రంలో ఏవియేషన్, డ్రోన్ రంగాలకు కర్నూలు కీలక కేంద్రం

కర్నూలు ఎయిర్‌పోర్టులో ఓరియంట్ ఫ్లయింగ్ అకాడమీ ఎఫ్‌టీఓ ప్రారంభం

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



ఓర్వకల్ సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్): ఆంధ్రప్రదేశ్‌ను ఏవియేషన్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. **మిగతా 2లో...**

మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

: ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ

పీవీ, మన్మోహన్ వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని వ్యాఖ్య

మౌనాన్ని భాషగా మార్చి గొప్ప పాలన అందించారని ప్రశంస

హైదరాబాద్ సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్):
మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, విప్రో సర్కిల్ వద్ద మన్మోహన్ **మిగతా 2లో...**



పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు

సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు

పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ

వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక బిద్దుబాటు చర్యల ఆదేశం

అమరావతి సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్):
సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. **మిగతా 2లో...**

భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం సమీక్ష


వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం

ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు

తాజా వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు

రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల

అమరావతి సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్):
గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. **మిగతా 2లో...**



కబడ్డీలో భారత్ డబుల్ గోల్డ్

మొదటిపేజీ తరువాయి

భారత జట్టు 40-34 తేడాతో ఇరాన్‌పై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఒక దశలో ఇరు జట్ల స్కోర్లు 20-20తో సమంగా నిలిచాయంటే పోరు ఎంత తీవ్రంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, కీలక సమయంలో పుంజుకున్న భారత క్రీడాకారులు ఇరాన్‌పై పైచేయి సాధించి విజయాన్ని అందుకున్నారు. వరుసగా ఏడుసార్లు స్వర్ణాలు గెలిచిన భారత పురుషుల జట్టు, 2018 జకార్తా గేమ్స్‌లో ఇరాన్ చేతిలో ఓడి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే, ఆ తర్వాత పుంజుకుని 2023లో టైటిల్ గెలిచి, ఇప్పుడు దాన్ని నిలబెట్టుకుని మరోసారి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.

అంతకుముందు జరిగిన మహిళల ఫైనల్‌లో కూడా భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇరాన్‌పై 37-34 తేడాతో గెలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. దీంతో రెండు విభాగాల్లోనూ ఇరాన్‌ను ఓడించి భారత్ డబుల్ గోల్డ్ సాధించినట్టయింది.

మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మౌనాన్ని తన భాషగా మార్చుకుని, దేశానికి అద్భుతమైన పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అంతటి మహనీయుడికి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ తీసుకుని మన్మోహన్ సింగ్‌ను భారతరత్నతో సత్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల దార్శనికత వల్లే దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, దాని ఫలితంగానే నేడు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ చట్టాన్ని తీసుకువచ్చి, భూనిర్వాసితుల అంగీకారాన్ని తప్పనిసరి చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.

మన్మోహన్ సింగ్ జీవితం నేటి 'జెన్-జెడ్' సహా అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలును ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు





మొదటిపేజీ తరువాయి కర్నూలు జిల్లాను ఏవియేషన్, డ్రోన్, పారిశ్రామిక రంగాలకు కీలక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.కర్నూలు విమానాశ్రయంలో హిందుస్థాన్ గ్రూప్‌కు చెందిన ఓరియంట్ ఫ్లయింగ్ అకాడమీ ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ)ను కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తొలి ఎఫ్‌టీఓను కర్నూలులో ఏర్పాటు చేయడం చారిత్రాత్మక పరిణామమన్నారు. కేవలం విమానాశ్రయాల నిర్మాణానికే పరిమితం కాకుండా శిక్షణ, విమానాల నిర్వహణ, గ్రౌండ్ ఆపరేషన్స్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ తదితర అన్ని విభాగాలతో సమగ్ర ఏవియేషన్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.దేశంలో 2014లో 74 విమానాశ్రయాలు ఉండగా ప్రస్తుతం సుమారు 166కు చేరాయని మంత్రి వెల్లడించారు. విమానాశ్రయాలు, విమానాలు, ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం కూడా పెరుగుతోందన్నారు. ఈ అవసరాన్ని తీర్చడంలో ఎఫ్‌టీఓల పాత్ర కీలకమని పేర్కొన్నారు.కర్నూలు భౌగోళికంగా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సమీపంలో ఉండటంతో ఏవియేషన్ కార్యకలాపాలకు అనుకూల ప్రాంతమని మంత్రి తెలిపారు. ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న విమానాశ్రయంతో పాటు ఏడాది పొడవునా అనుకూల వాతావరణ పరిస్థితులు ఉండటం పైలట్ శిక్షణకు అదనపు ప్రయోజనమన్నారు. ప్రస్తుతం ఎఫ్‌టీఓలో మూడు శిక్షణ విమానాలు ఉన్నాయని, వాటి సంఖ్యను త్వరలో 10కి పెంచి కర్నూలును దేశంలోని ముఖ్యమైన ఏవియేషన్ కేంద్రాల్లో ఒకటిగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.ఎఫ్‌టీఓ ద్వారా ఏడాదికి సుమారు 60 మంది విద్యార్థులకు శిక్షణ అందించే సామర్థ్యం ఏర్పడుతుందని తెలిపారు. దీనితో పాటు విమానాల నిర్వహణ, గ్రౌండ్ ఆపరేషన్స్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు

కాళేశ్వరం పునరుద్ధరణకు రంగం సిద్ధం

మొదటిపేజీ తరువాయి సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

10 శాతం వృద్ధి సాధ్యమే

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు.దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు.ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు.2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు.

నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే

మొదటిపేజీ తరువాయి

ఉన్న గ్రూప్ ఫోటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది.

కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది.

గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మందిలో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం-6 సమర్పించారని వెల్లడించింది.

ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ఈసీఐనెట్ (జుజ×చీజు) పోర్టల్‌పై తలెత్తిన అందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్-బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యుటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది.

అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది. కమిషనర్లు అధికారులకు జారీ చేసే ఆదేశాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ప్రత్యేక సవరణ గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది. తమ ప్రధాన నిర్ణయాలన్నీ సమష్టిగా, ఏకగ్రీవంగానే తీసుకున్నామని కమిషన్ పునరుద్ఘాటించింది.

సీఈసీ రాజీనామా చేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి

జరపాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ శనివారం గట్టిగా పట్టుబట్టింది.ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, ఈసీఐ నేడు ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ వివరణ కాంగ్రెస్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈసీఐ ఇప్పుడు ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులతో ఈసీఐని, సీఈసీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు."మీడియా కథనాల్లో వచ్చిన ఆరోపణలను ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో ఎక్కడా నేరుగా ఖండించలేదు. వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నం మాత్రమే చేసింది. గోవా విషయంలో తప్పు చేసి దొరికిపోయాక, తొలగించిన 97 మందిలో 81 మంది పేర్లను తిరిగి చేర్చామని సిగ్గులేకుండా చెబుతోంది. అంటే, మొదట ఓటర్ల హక్కును కాలరాసి, దొరికిపోయాక మళ్లీ వారి పేర్లను చేర్చుతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఓటరు నమోదు గడువును పొడిగించిన ఈసీఐ.. కర్ణాటక, తెలంగాణ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. కేవలం ఒక వ్యక్తి అవినీతి వల్ల ఓటు హక్కు కోల్పోయిన ఈ రాష్ట్రాల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీఐకి లేదా అని ఆయన అన్నారు.సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐఐటీ/ట్రిపుల్ ఐటీ నిపుణులతో ఈసీనెట్ పోర్టల్‌ను సమీక్షిస్తామని చెప్పడం, సమస్య ఉందని అంగీకరించడమేనని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రతిపక్షాలపై ద్వేషం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, ముఖ్యంగా యువ ఓటర్లను (జెన్ Z) లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలు ఆయన అవినీతిని బయటపెట్టాయని ఆరోపించారు. ఫారం 6లో పార్లమెంటు ఆమోదం లేకుండా మార్పులు చేసి, యువత ఓటు నమోదు చేసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

సీఈసీ బ్యూరోక్రసీ ముసుగులో దాక్కోవాలని చూస్తున్నారని, కానీ ఆయన బండారం బట్టబయలైందని జైరాం రమేశ్ అన్నారు. దేశమంతా ఆయనను జవాబుదారీ చేయాలని చూస్తోందని, ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా లేదా ఆయనపై విచారణ జరపడం మినహా మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

మొదటిపేజీ తరువాయి

వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు.

డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు



షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది.నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం సమీక్ష

మొదటిపేజీ తరువాయి

శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు.


అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వరప్రాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు.

గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గోట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది: సీఎం చంద్రబాబు



భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నారు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు.

స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

కర్నూలు రీజినల్ ఐ హాస్పిటల్‌లో ఓసిటి యంత్రం ప్రారంభం

డయాబెటిస్ రోగుల్లో కంటి సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ఆధునిక సాంకేతికత





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 26)
కర్నూలు రీజినల్ ఐ హాస్పిటల్‌లో డయాబెటిస్ రోగుల్లో కంటి సంబంధిత సమస్యలను కచ్చితంగా గుర్తించేందుకు ఏర్పాటు చేసిన ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీ (ఓసిటి) యంత్రాన్ని రాష్ట్ర మంత్రి టీ.జీ. భరత్ ప్రారంభించారు. సీడీఎస్ నిధులతో రూ.28.50 లక్షల వ్యయంతో ఈ ఆధునిక యంత్రాన్ని ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా మంత్రి టీ.జీ. భరత్ మాట్లాడుతూ, డయాబెటిస్ కారణంగా కళ్లలో చోటుచేసుకునే మార్పులను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందించేందుకు ఓసిటి యంత్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒక్కో ఓసిటి పరీక్షకు సుమారు రూ.30 వేల వరకు ఖర్చవుతుందని, ఏడాదిలో పలుమార్లు పరీక్షలు చేయించుకోవాల్సిన రోగులకు ఇది ఆర్థిక భారంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పరీక్షను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.
రీజినల్ ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఓసిటి ద్వారా డయాబెటిస్ రోగుల కంటి వెనుక భాగంలో వచ్చే సూక్ష్మ మార్పులను అధునాతన సాంకేతికతతో గుర్తించవచ్చని తెలిపారు. తద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే నిర్ధారించి అవసరమైన చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా. కే. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి రావడంతో ఖరీదైన వైద్య పరీక్షలు కూడా ప్రజలకు ఉచితంగా అందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా డయాబెటిస్ రోగులు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలను పాటించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో మంత్రి టీ.జీ. భరత్‌తో పాటు రీజినల్ ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సత్యనారాయణ రెడ్డి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా. కే. వెంకటేశ్వర్లు, హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు పి.టి. సాయిప్రదీప్, డా. ప్రవీణ్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 629 మంది ఏపీఎస్పీ ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వహించాలి -ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంచాలి: మంత్రి టీజీ భరత్





కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 26)
కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్ పరేడ్ మైదానంలో 202526 బ్యాచ్‌కు చెందిన 629 మంది ఏపీఎస్పీ ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్పీ 2వ బెటాలియన్‌లో 430 మంది, కర్నూలు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో 199 మంది కలిపి మొత్తం 629 మంది తొమ్మిది నెలల శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు.
ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలో శిక్షణార్థులు ప్రదర్శించిన క్రమశిక్షణతో కూడిన కవాతు, మార్చ్‌పాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
అనంతరం శిక్షణ కాలంలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ట్రైనీ కానిస్టేబుళ్లకు మంత్రి టీజీ భరత్ అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉత్తమ డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్లను కూడా సత్కరించారు.
ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. తొమ్మిది నెలల కఠిన శిక్షణ అనంతరం ట్రైనీ కానిస్టేబుళ్లు అద్భుతంగా పరేడ్ నిర్వహించారని అభినందించారు. శిక్షణను పకడ్బందీగా పర్యవేక్షించిన శిక్షకుల కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు.
పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేలా కానిస్టేబుళ్లు సేవా దృక్పథంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అసాంఘిక శక్తులు, రౌడీ మూకలకు చట్టంపై భయం కలిగించేలా పనిచేస్తూనే.. సామాన్య ప్రజలు ప్రశాంతంగా జీవించేలా రక్షణ కల్పించాలని అన్నారు.
ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం సమకూరుస్తున్న కృత్రిమ మేధస్సు (ఏఐ), సీసీటీవీ నెట్‌వర్క్, వాహనాల కదలికల విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతిక సాధనాలను పోలీసులు సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. నేర పరిశోధన, నిందితుల గుర్తింపును మరింత వేగవంతం చేయడంతో పాటు సరికొత్త ఆలోచనలతో వృత్తి నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని అన్నారు.
తమ పిల్లలను దేశసేవకు, పోలీసు వృత్తికి అంకితం చేసిన తల్లిదండ్రుల త్యాగం వెలకట్టలేనిదని మంత్రి పేర్కొన్నారు. వారి ఆశయాలను నిలబెట్టి పోలీసు శాఖకు, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నిరుద్యోగ యువత సంక్షేమానికి కట్టుబడి ఉందని, భవిష్యత్తులో క్రమం తప్పకుండా పోలీసు నియామకాలు చేపట్టి కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు.
ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపీఎస్ మాట్లాడుతూ.. తొమ్మిది నెలల శిక్షణలో ట్రైనీ సిబ్బందికి ఆధునిక పోలీసింగ్‌కు అవసరమైన వివిధ అంశాల్లో సమగ్ర శిక్షణ అందించినట్లు తెలిపారు.
కార్యక్రమంలో కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఐఏఎస్, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్, ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపీఎస్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్, డీటీసీ ప్రిన్సిపాల్ జి. హుస్సేన్ పీరా, అడిషనల్ కమాండెంట్ నాగేంద్రరావు, అసిస్టెంట్ కమాండెంట్లు డి. వెంకట రమణ, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి. దుర్గా ప్రసాద్, డీఎస్పీలు, సీఐలు, ఇతర పోలీసు అధికారులు, శిక్షణ సిబ్బంది, ట్రైనీ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన ట్రైనీలు

ఏపీఎస్పీ 2వ బెటాలియన్:
బెస్ట్ ఆల్‌రౌండర్, బెస్ట్ ఇండోర్: నందికం శ్రీనివాసులు
బెస్ట్ అవుట్‌డోర్: ముప్పూరి ప్రశాంత్
బెస్ట్ ఫైరర్: పరస తరుణ్ కుమార్
పరేడ్ కమాండర్: అంకె నందకుమార్

డీటీసీ:
బెస్ట్ ఆల్‌రౌండర్, బెస్ట్ ఇండోర్: చప్పటి రోహిత్
బెస్ట్ అవుట్‌డోర్: లక్కింశెట్టి మహేష్
బెస్ట్ ఫైరర్స్: వెంకట సాయి కృష్ణారెడ్డి, అసది శివశంకర్





మిత్రుల ఆర్థిక సహాయానికి ఎదురుచూస్తున్న జర్నలిస్ట్ గాజుల నాగరాజు

జగిత్యాల జిల్లా జిల్లా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు సీనియర్ జర్నలిస్ట్ గాజుల నాగరాజు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు...



రాయికల్ మండలం సెప్టెంబర్.26 (రిపబ్లిక్ న్యూస్)
గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు... గత వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదం లో తీవ్రంగా గాయపడ్డాడు... జగిత్యాల చికిత్స పొందుతూ పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీ తరలించారు... జర్నలిస్ట్ కోసం ఉమ్మడి జిల్లా మొన్నటి వరకు జర్నలిస్ట్ ల బస్ పాస్... రినివెల్ స్టాంపింగ్... రైల్వే పాస్ తను స్వయంగా తీసుకెళ్లి రెనివెల్ చేయించి జర్నలిస్ట్ ల ఇంటికి వెళ్ళి స్వయంగా అందించేవారు...
ప్రస్తుతం వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉంది... జగిత్యాల ప్రెస్ క్లబ్ నుండి కొంత డబ్బు ఆర్థిక సాయం చేసిన హాస్పిటల్ ఖర్చులకు సరిపోవడం లేదు. తన భార్య ఇద్దరు ఆడపిల్లలు ఎవరిని సహాయం కొరకు అడగలేని దీన పరిస్థితి లో ఉన్నారు.వారిని చూసే నాధుడు లేక రోజు వేల రూపాయలు ఖర్చు భరించలేక మానసిక వేదనకు గురవుతున్నారు.
దయచేసి జిల్లా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లాలోని మిత్రులకు తమకు తోచినంత ఉడత భక్తిగా ఆర్థిక సహాయం చేసి తమ తోటి జర్నలిస్ట్ మిత్రుడు గాజుల నాగరాజు కుటుంబానికి అండగా నిలుద్దాం..

సామాజిక వర్గాల వారీ ఓటరు ముసాయిదా జాబితా విడుదల

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల వివరాలపై అభ్యంతరాలకు అవకాశం

ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు లిఖితపూర్వకంగా తెలియజేయాలి



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 26)
కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తించే ప్రక్రియలో భాగంగా రూపొందించిన సామాజిక వర్గాల వారీ ఓటరు ముసాయిదా జాబితాను ఎలక్షన్ అడిషనల్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు విడుదల చేశారు.కర్నూలు నగరంలోని ఎస్బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో ముసాయిదా జాబితా ప్రచురణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రజల పరిశీలన కోసం జాబితాను నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు.ఈ సందర్భంగా కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. సామాజిక వర్గాల వారీగా గుర్తించిన ఓటర్ల ముసాయిదా జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు పరిశీలించాలని సూచించారు. జాబితాలో తమ పేరు లేదా వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు నగరపాలక సంస్థ కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు.కార్యక్రమంలో డీసీపీ శబ్నం శాస్త్రీ, ఏసీపీ నాగరాజు, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

అభిమానులు సేవా కార్యక్రమాలతో తమ అభిమానాన్ని చాటుకోవాలి: మంత్రి టీజీ భరత్



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 26)
కర్నూలు నగరంలోని గాంధీనగర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన గొప్ప నటుడని కొనియాడారు. 350కి పైగా చిత్రాల్లో నటించి తెలుగు సినీ ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. సినీ రంగానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.కర్నూలు నగరంలో సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి అన్నారు. కృష్ణ అభిమానులు తమ అభిమానాన్ని కేవలం కార్యక్రమాలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల ద్వారా చాటుకోవాలని సూచించారు.అభిమానులు సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి టీజీ భరత్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కృష్ణ అభిమానులు, ప్రజలు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 26,(రిపబ్లిక్ న్యూస్):- వీఆర్ఏల నిరవధిక సమ్మెలో భాగంగా 11వ రోజు శ్రీశైలం నియోజకవర్గ శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. శనివారం నియోజకవర్గంలోని వీఆర్ఏలు అందరూ ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు తమ దీర్ఘకాలిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వీఆర్ఏలకు పే స్కేల్ వర్తింపజేసి, అర్హత కలిగిన వీఆర్ఏలకు వన్ టైం సెటిల్మెంట్ కింద వీఆర్వో గా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. అలాగే కారుణ్య నియామకం కింద నామినీగా పనిచేస్తున్న వీఆర్ఏలను రెగ్యులర్ వీఆర్ఏలుగా గుర్తించాలని విన్నవించారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గంలోని మొత్తం 159 మంది వీఆర్ఏలు పాల్గొన్నారు. ఇందులో బండి ఆత్మకూరు మండలానికి చెందిన 57 మంది, మహానంది మండలానికి చెందిన 30 మంది, వెలుగోడు మండలానికి చెందిన 32 మంది, ఆత్మకూరు మండలానికి చెందిన 40 మంది వీఆర్ఏలు పాల్గొన్నారు.

పోషకాహారం వల్ల సంపూర్ణ ఆరోగ్యం - డాక్టర్ దినేష్ బాబు



బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 26,(రిపబ్లిక్ న్యూస్):- పోషకాహారం తీసుకోవడం వల్ల శారీరక ఎదుగుదలతో ఆరోగ్యవంతంగా తయారవుతారని నారాయణపురం గిరిజన ఆసుపత్రి, వైద్యాధికారి డాక్టర్ దినేష్ బాబు సూచించారు. శనివారం మండలంలోని సంత జుటూరు, పెద్ద దేవాలాపురం అంగన్వాడి కేంద్రాల్లో అంగన్వాడి కేంద్రాలలో తొమ్మిదవ పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు సిడిపిఓ కోటేశ్వరి, వైద్యాధికారి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గర్భిణీలు బాలింతలకు అంగన్వాడీ కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు. సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 26 నుంచి అక్టోబర్ 7 వరకు అంగన్వాడీ ఉత్సవాలు జరుగుతున్నాయని సిడిపిఓ తెలిపారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన గురించి , అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఆరోగ్యకర ఎదుగుదలతో పాటు గర్భిణీలు బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం డాక్టర్ దినేష్ క్షుణ్ణంగా వివరించారు. అనంతరం కార్యకర్తగా గత 34 సంవత్సరాల నుండి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న అంగన్వాడీ కార్యకర్త పి.శ్యామలను అధికారులు అభినందించారు. శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి అరుణ, వెల్ఫేర్ అసిస్టెంట్ భారతి ఏఎన్ఎం వీరమ్మ, ఎం ఎల్ హెచ్ పి యశోద, ఆశా కార్యకర్త, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కు వినతిపత్రం ఇచ్చిన వి ఆర్ ఏ లు





ఆళ్లగడ్డ సెప్టెంబర్ 27 రిపబ్లిక్ న్యూస్ గత పది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా తమ డిమాండ్ల సాధన కోసం ధర్నా చేస్తున్న వి ఆర్ ఏ లు ఈ రోజు ఉదయం తహసీల్దార్ కార్యాలయం నుండి ఊరేగింపుగా పాత బస్టాండ్ మీదుగా వెళ్లి ఎమ్మెల్యేభూమా అఖిల ప్రియ కు వినతిపత్రం అందించారు.ఆళ్లగడ్డ తాలూకాకు సంబంధించిన వి ఆర్ ఏ ల డిమాండ్ల కు ప్రభుత్వం సహకరించాలని ధర్నాగా వచ్చి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.మొదటిగా పే స్కేల్ ఇవ్వాలని, అలాగే ప్రమోషన్లు ఇవ్వక ఎనిమిది సంవత్సరాలుఅవుతుందని, నామినీలుగా ఉన్న వి ఆర్ ఏ లను, పర్మినెంట్ చేయాలని, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియని కోరడం జరిగింది.అనంతరం ర్యాలీ గా నాలుగు రోడ్ల సెంటర్కు వెళ్లారు.

సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ





ఆళ్లగడ్డ సెప్టెంబర్ 27 రిపబ్లిక్ న్యూస్ ఆళ్లగడ్డ పట్టణం లోని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ నివాసంలో సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.సీఎం సహాయక నిధి కింద సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసిన సీఎం నారా చంద్రబాబునాయుడు గారు.ఆళ్లగడ్డ తాలూకాకు సంబందించిన 48 మంది బాధిత కుటుంబాలకు, 22,27, 003 రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు తీసుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు ,సీఎం నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంపీడీవో-ఎన్.చంద్రశేఖర్ ఆదేశాల మేరకు కేజీ.రోడ్డు ప్రక్కన ఉన్న బోరింగుకు మరమ్మత్తులు చేయించిన మాజీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి



పాములపాడు సెప్టెంబర్-26 రిపబ్లిక్ న్యూస్:-మండల కేంద్రమైన పాములపాడులో ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్ ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్ మేకల భాగ్యమ్మ కుమారుడు ఏం.రాజశేఖర్, పంచాయతి కార్యదర్శి క్రాంతి కుమార్ లు కేసురుడు ప్రక్కన ఉన్న చెడిపోయిన బోరింగ్ కు మరమ్మతులు చేపించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజల నీటి సమస్యలు తీర్చడానికి ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నామని తెలియజేశారు.

వీఆర్ఏ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించండి

వీఆర్ఏ సంఘం డిమాండ్ -చిప్పగిరి తాసిల్దార్ కార్యాలయము దగ్గర నిరసన



చిప్పగిరి, సెప్టెంబర్, 26.(రిపబ్లిక్ న్యూస్) వీఆర్ఏ సమస్యలను వెంటనే శాశ్వతంగా పరిష్కరించాలని వీఆర్వో సంఘం డిమాండ్ చేశారు, స్థానిక చిప్పగిరి తాసిల్దార్ కార్యాలయం నందు నిరసన కార్యక్రమం నిర్వహించారు, వీఆర్ఏలు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుండి నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వీఆర్ఏ లందరికీ రెగ్యులర్ పే స్కేల్ వర్తింపజేయాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వీఆర్ఏలుగా పని చేస్తూ తగిన విద్యా అర్హత కలిగిన వారికి పరీక్షలు లేకుండా వీఆర్వో రికార్డ్ అసిస్టెంట్, అటెండర్, మరియు నైట్ వాచ్మెన్ పోస్టులు పదోన్నతులు కల్పించాలని, మరణించిన వీఆర్ఏ కుటుంబాల్లో వయసుతో సంబంధం లేకుండా అర్హునైన ఒక్కరికి వెంటనే ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని, ఇవన్నీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు, ఈ కార్యక్రమంలో గోవిందు, హనుమంతు, నగరడోన సుంకన్న, లాలెప్ప, దేగుల హల్ రారాజు, హుస్సేన్,, లక్ష్మీపతి పద్మ, పెద్ద రామాంజిని, నాగలక్ష్మి, రామాంజిని, మహేంద్ర, సిద్ధ, తదితరులు పాల్గొన్నారు.

పాములపాడులో స్వచ్ఛ రథం మరియు బిన్ బ్యాగ్ వ్యవస్థపై అవగాహన సదస్సు



పాములపాడు సెప్టెంబర్ 26 రిపబ్లిక్ న్యూస్:-ఆత్మకూరు డివిజన్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దసరా ధమాకా – స్వచ్ఛ ఆత్మకూరు కార్యక్రమంలో భాగంగా ఈరోజు పాములపాడు గ్రామంలో ఎంపీడీఓ ఎన్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి బిన్ బ్యాగుల్లో వేయాలని, పొడి చెత్తను స్వచ్ఛ రథానికి అందించాలని కోరారు. పాములపాడు మండలంలోని ప్రజలందరూ ఈ దసరా ధమాకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని పొడి చెత్త సేకరణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అత్యధికంగా పొడి చెత్త అందించిన వారికి కూపన్లు ఇచ్చి లక్కీ డిప్ ద్వారా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, స్వచ్ఛతా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపర్డెంట్ తిరుపాలు, వెలుగు సిసి కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, పొదుపు మహిళలు తదితరులు పాల్గొనడం జరిగింది.

వేంపెంట జడ్పీ హైస్కూల్ లో శక్తి యాప్ పై, భద్రత నియమాలపై అవగాహన కల్పించిన ఏఎస్ఐ షేక్.నూర్ అహమ్మద్

పాములపాడు సెప్టెంబర్-26 రిపబ్లిక్ న్యూస్:-నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు ఆత్మకూరు డి.ఎస్.పి ఆర్.రామాంజి నాయక్ ఉత్తర్వుల మేరకు మరియు రూరల్ సీఐ ఎం.సురేష్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో శక్తి టీం సిబ్బంది పాములపాడు ఏఎస్ఐ షేక్.నూర్ అహమ్మద్, ఆత్మకూరు ఉమెన్ హోమ్ గార్డ్ సుప్రియ ల మరియు పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ షేక్.రఫీక్ అహ్మద్ ల ఆధ్వర్యంలో సుమారు 240 మంది పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు శక్తి యాప్ గురించి, అత్యవసర పరిస్థితిలో పోలీసుల రక్షణ పొందడానికి చేయవలసిన ఫోన్ నెంబర్ల గురించి అవగాహన కల్పించడం జరిగింది.
ఈ సందర్భంగా ఏఎస్ఐ షేక్.నూర్ అహమ్మద్ మాట్లాడుతూ శక్తి యాప్ అవేర్నెస్ " ప్రోగ్రాము లో భాగంగా మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన " శక్తి యాప్ " గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి, బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు ఫోన్ చేయవలెనని తెలిపారు. 18 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని అట్లా ఎవరయినా చేస్తునట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పాలని తెలుపుతూ, ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్



చేయవలెనని, ఫేక్ కాల్స్, ఏపీకే ఫైల్స్ లాంటివి ఏదన్నా మీ పేరెంట్స్ సెల్ ఫోన్ వాట్సప్ లకు ఎవరైనా లింక్ మెసేజ్లు పంపితే వాటిని ఓపెన్ చేయొద్దని తెలుపుతూ వాటి ద్వారా వారికీ జరిగే ఆర్థిక నష్టాలను గురించి కూడా తెలిపి, వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. మీరు, మీ ఇండ్లకు పోయిన తర్వాత మీ పేరెంట్స్ యొక్క ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లలలో శక్తీ యాప్ డౌన్ లోడ్ చేసుకొని, అత్యవసర సమయాలలో శక్తీ యాప్ ను ఎలా వాడాలి, దానీ ఉపయోగాల గురించి తెలపడం జరిగింది. అంతే కాకుండా మీరు మంచి క్రమశిక్షణతో మెలుగుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ ఆడపిల్లలను" ఈవిటీజింగ్ " పేరుతో ఎవరైనా ఆకతాయిలు అల్లరి పట్టించడం లాంటివి చేస్తే, ఏ మాత్రం అధైర్య పడకుండా మీకు రక్షణగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తీ యాప్ ను ఉపయోగించి 112 కు గానీ, 1098 కి గానీ ఫోన్ చేసి సహాయం పొందవచ్చునని అవగాహన కల్పించారు. అదేవిధంగా 18 సంవత్సరాలలోపు, వయస్సు ఉన్న మైనర్(బాల, బాలికలు) విద్యార్థులు ఎవరు కూడా మోటార్ సైకిల్ (బైక్)ను నడపకూడదని తెలియపరిచినాము. చదువు మీద ధ్యాస పెట్టి బాగా కష్టపడి చదివి మీ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని, చదువు ఒక్కటే మిమ్మల్ని సమాజంలో గౌరవాన్ని, మర్యాదను, హుందాతనాన్ని తీసుకొచ్చి మీ తలరాతలను మార్చేది చదువు ఒక్కటే అని తెలుపుతూ అదేవిధంగా మీ ఇంట్లోని, మీ పేరెంట్స్ మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు రక్షణగా " హెల్మెట్ " పెట్టుకొని ప్రయాణం చేయాలని హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఎవ్వరూ కూడా మీ ఇంట్లోని వారు నాన్న, అన్నా, తమ్ముడు బాబాయి, మేనమామ లు లేక మీ కాలనీవాసులకు ఎవ్వరైనా సరే మధ్యం త్రాగి వాహనాలను నడపవద్దని అందరికీ ఈ సమాచారం తెలియజేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా త్రాగి వాహనాలు నడిపితే కోర్టు వారు 10 వేల రూపాయలు (ఫైన్) జరిమానా లేదా జైలు శిక్షను విధిస్తారని తెలుపుతూ అవగాహన కల్పించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొనడం జరిగింది.

రైతుల సందేహాలకు ప్రత్యేక హాట్‌లైన్

రెజోనియా టోల్‌ఫ్రీ నంబర్ ఆవిష్కరణ -నేరుగా కంపెనీతో మాట్లాడే అవకాశం : కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబర్ 26,(రిపబ్లిక్ న్యూస్):
విద్యుత్ హైపవర్ ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణానికి సంబంధించి రైతుల్లో ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసేందుకు రెజోనియా సంస్థ ప్రత్యేక హాట్‌లైన్ ఏర్పాటు చేసింది. 1800 309 4401 టోల్‌ఫ్రీ నంబర్‌ను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం తన చాంబర్‌లో కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.

నివృత్తి చేసుకునే అవకాశం కల్పించడం అభినందనీయం

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ ప్రాజెక్టులకు అనుసంధానంగా హైపవర్ ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ పనులకు సంబంధించి రైతులకు పలు సందేహాలు ఉండటం సహజమని, వాటిని నేరుగా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి నివృత్తి చేసుకునే అవకాశం కల్పించడం అభినంద నీయమన్నారు.టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులోకి రావడంతో రైతులకు, కంపెనీకి మధ్య



ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా సమాచారం తెలుసుకునే వీలు కలుగుతుందని చెప్పారు. ట్రాన్స్‌మిషన్ టవర్లు, లైన్ల నిర్మాణం, పరిహారం తదితర అంశాలపై రైతులకు ఉన్న సందేహాలను స్పష్టంగా తెలుసుకునేందుకు ఈ హాట్‌లైన్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణంలో టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు

రెజోనియా అనంతపురం ప్రాజెక్ట్ హెడ్ గిరిప్రసాద్ మాట్లాడుతూ కర్ణాటక నుంచి అనంతపురం జిల్లా మీదుగా వైఎస్సార్ జిల్లా సీకే దిన్నె వరకు ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. తమ కంపెనీ పరిధిలో సుమారు 40 వేల మంది రైతులు ఉన్నారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు.1800 309 4401 నంబర్ సోమవారం నుంచి శుక్రవారం వరకు పనిదినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. రైతులు తమకు ఉన్న సందేహాలు, అపోహలను నేరుగా ఈ నంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు.కార్యక్రమంలో రెజోనియా ఆర్ఓడబ్ల్యూ మేనేజర్ వినోద్, సీఎస్ఆర్ మేనేజర్ కృతిక లక్ష్మి, ఎగ్జిక్యూషన్ మేనేజర్ జైకుమార్, కంపెనీ ప్రతినిధి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం

అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు మంత్రి అభినందనలు -చిన్నారుల భవిష్యత్తుకు అంగన్‌వాడీలే పునాది

శ్రీ సత్యసాయి/బత్తలపల్లి, సెప్టెంబరు 26,(రిపబ్లిక్ న్యూస్):
సమాజంలో ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా చిన్నారులు, తల్లులు, కుటుంబాల ఆరోగ్య సంరక్షణ కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. బత్తలపల్లిలో శనివారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్‌వాడీ ఉత్సవంలో ఆయన పాల్గొని సిబ్బందిని శాలువాలతో సత్కరించారు.

సేవలందిస్తున్న ఆశా వర్కర్ల కృషి అభినందనీయం

ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూఅంగన్‌వాడీ కేంద్రాలంటే చిన్నారుల ప్రారంభ విద్య, బాల్య సంరక్షణ, పోషణ, ఆరోగ్య పరిరక్షణకు అవి కీలక వేదికలని తెలిపారు. తల్లులు, తల్లిదండ్రులకు ఆరోగ్యం, పోషణపై అవగాహన కల్పించడంలోనూ సిబ్బంది కీలకంగా పనిచేస్తున్నారని



చెప్పారు. దేశవ్యాప్తంగా 14.03 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు సుమారు 8.98 కోట్ల మంది లబ్ధిదారులకు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ఇంత భారీ స్థాయిలో ప్రతిరోజూ సేవలందిస్తున్న సిబ్బంది కృషిని సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య వ్యవస్థకు వారధులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేయడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని సత్యకుమార్ తెలిపారు. ప్రజారోగ్యానికి సంబంధించి ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో వారు వారధిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ సేవలందిస్తున్న ఆశా వర్కర్ల కృషిని అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునిక వసతులతో అభివృద్ధి

సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు దేశవ్యాప్తంగా " సేవా సంకల్ప్ అభియాన్ " నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునిక వసతులతో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సక్షమ్ అంగన్‌వాడీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని,"పోషణ్ భీ పఢాయీ భీ" కార్యక్రమం ద్వారా చిన్నారుల పోషణతో పాటు ప్రారంభ విద్యకు ప్రాధాన్యం పెంచుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ, రాష్ట్ర కార్యదర్శి కోటి సుధ, సత్యసాయి జిల్లా ఇన్‌చార్జి కునిగిరి నీలకంఠ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు జగ్గా నాగరత్న, బత్తలపల్లి మండల అధ్యక్షుడు భాస్కర్, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు కే.లక్ష్మి, సీడీపీఓ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టానికి ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

గుత్తి సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్)
ఎల్‌నినో ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామ్‌రెడ్డి, బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం గాంధీ సర్కిల్‌లో జీపుజాత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని, పశువులకు మేత కూడా దొరకని పరిస్థితి నెలకొందన్నారు.
పంట నష్టంపై అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని, బ్యాంకు రుణాలను రద్దు



చేయాలని డిమాండ్ చేశారు. క్రాప్‌లోన్, ఇన్సూరెన్స్‌తో సంబంధం లేకుండా తక్షణమే పంట నష్టపరిహారం అందించాలన్నారు. ముందస్తు ప్రకటన లేకుండా విద్యుత్ కోతలు విధించడం వల్ల వ్యవసాయ బోర్ల ద్వారా పంటలకు నీరు అందించలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.
ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించినా ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో వ్యవసాయ రంగం నష్టపోతోందన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 28న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు రైతులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జగన్, రైతు సంఘం జిల్లా నాయకులు రాజారాంరెడ్డి, ప్రజానాట్యమండలి కార్యదర్శి పుల్లన్న, సహాయ కార్యదర్శి కుల్లాయప్ప, సీపీఎం మండల కమిటీ సభ్యులు రేణుక, రేవతి, రామేశ్వరి, పార్టీ సభ్యులు వన్నూరమ్మ, చందు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోట వేడుకలకు ఎంపీకి ఆహ్వానం



గుత్తి సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్)

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 27న గుత్తి కోట సమీపంలో నిర్వహించనున్న వేడుకలకు అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణను గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు ఆహ్వానించారు. శుక్రవారం అనంతపురంలోని ఎంపీ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. పురాతన కట్టడాల పరిరక్షణతోపాటు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కోట సంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో ఆపన్నహస్తం

రూ.74.04 లక్షల ఆర్థిక సాయం

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల



మడకశిర సంక్షేమం, సెప్టెంబర్ 26.(రిపబ్లిక్ న్యూస్):

వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) భరోసా కల్పించింది. మడకశిర నియోజకవర్గంలో 192 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.74,04,996 ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ భారీగా ఖర్చు చేసిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన సాయం కొంతమేర ఆర్థిక ఊరటనిచ్చింది. సీఎంఆర్ఎఫ్ ద్వారా అర్హత ఉన్న బాధితులకు సకాలంలో సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్యం కారణంగా ఎదురయ్యే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ సహాయ నిధి ఉపయోగపడుతుందన్నారు.నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సహాయం అందేలా కూటమి ప్రజాప్రతినిధులు కృషి చేస్తారని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌పై ప్రత్యేక అవుట్‌రీచ్ క్యాంపెయిన్

సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 5 వరకు విస్తృత ప్రచారం

అక్టోబర్ 2న మదనపల్లెలో సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక ప్రారంభం

అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలి: కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 26)

రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచస్థాయి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న “గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రైజింగ్ రాయలసీమ” కార్యక్రమంపై సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 5 వరకు ప్రత్యేక అవుట్‌రీచ్ క్యాంపెయిన్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యానవన రంగ అభివృద్ధిపై ప్రజలు, రైతులు, విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

పాఠశాలలు, కళాశాలల్లో పోటీలు, డిజిటల్ కాంటెస్టులు నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి ప్రదర్శనలు, ప్రచార రథాలు, ట్రాక్టర్ ర్యాలీలు, కళాజాతాల ద్వారా హార్టికల్చర్ హబ్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

అక్టోబర్ 2న మదనపల్లెలో గౌరవ ముఖ్యమంత్రి, గౌరవ కేంద్ర ఆర్థిక మంత్రి చేతుల మీదుగా సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక (ఐహెచ్‌డిపి) ప్రధాన కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమాన్ని ప్రతి రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కె)లో ప్రత్యక్ష ప్రసారం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

పాఠశాలల్లో “నా జిల్లానా పంట”, “పంటను ఊహించండి”, “ఒక మొక్క భవిష్యత్తు కోసం” వంటి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 29న హార్టికల్చర్ క్లస్టర్లలో “తోట పాఠశాల” కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, మైక్రో ఇరిగేషన్, ఫామ్ పాండ్స్, వీడ్ మ్యాట్స్ వంటి ఆధునిక ఉద్యాన సాగు పద్ధతులపై రైతులకు క్షేత్రస్థాయి ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు.

సెప్టెంబర్ 30న పది జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహించాలని, అక్టోబర్ 1న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో పూలు, పండ్లు, కూరగాయలు, విత్తనాలను ఇతివృత్తంగా చేసుకుని ముగ్గుల పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. “గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రైజింగ్ రాయలసీమ” కార్యక్రమంపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, ఆసక్తి ఉన్న యువతతో రీల్స్ రూపొందించి, పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అవుట్‌రీచ్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశించారు.

బైండ్‌ఓవర్ నిబంధలను ఉల్లంఘించిన రౌడీ షీటర్ పై కఠిన చర్యలు..

14 రోజుల జ్యూడిషల్ కస్టడీ... చట్టాన్ని ధిక్కరించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదు... డి.ఎస్. పి - శ్రీనివాస్ రావు

- ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగింపు.



రేణిగుంట సెప్టెంబర్ :26(రిపబ్లిక్ న్యూస్)

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు తిరుపతి జిల్లా పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బారాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో నేర నియంత్రణ, రౌడీషీటర్లపై నిఘా, సంఘవిద్రోహ కార్యకలాపాల అరికట్టడంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

ఈ క్రమంలో బైండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించిన ఒక రౌడీషీటర్‌పై కఠిన చర్యలు తీసుకుంటూ 14 రోజుల జ్యూడిషియల్ కస్టడీ విధించడం జరిగింది. నేరాలకు పాల్పడేవారికి ఇది స్పష్టమైన హెచ్చరికగా నిలుస్తుందని డి ఎస్ పి శ్రీనివాస్ రావు తెలిపారు.

ఈ నేపథ్యంలో రెడ్డిపల్లి ఇబ్రహీం కలీల్ ఏ షేక్ ఇమామ్, వయస్సు 29 తీయి గా/శీ లేట్ అబ్దుల్లా ణ.చీశీ 3-20 గురవరాజుపల్లి గ్రామం, రేణిగుంట మండలం, తిరుపతి జిల్లా నివాసి. ఇప్పుడు ణ.చీశీ 3-100, బుగ్గ వీధి, రేణిగుంట టౌన్‌లో ఉంటున్న ఇతను . గత 06 సంవత్సరాలుగా మద్యానికి బానిసై, తరచూ గొడవలకు పాల్పడటం, అలాగే మద్యం మత్తులో ఎదురుపడిన గుర్తుతెలియని వ్యక్తులను బెదిరించడం మరియు కొట్టడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వలన ఇతని పై రేణిగుంట పోలీస్ స్టేషన్ లో మూడు కేసులు, గాజుల మాండ్యం పోలీస్ స్టేషన్ లో ఒక కేసు చెప్పున మొత్తం నాల్గు కేసులు ఉన్నందున అతని పై రౌడీషీట్ తెరవబడింది. నేరప్రవృత్తికి దూరంగా ఉండి సత్ప్రవర్తనతో జీవించే అవకాశం కల్పించే ఉద్దేశంతో రేణిగుంట డి ఎస్ పి శ్రీనివాస్ రావు సూచనలతో రేణిగుంట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. జయచంద్ర 20 -07-2026 వ తేదీన సదరు వ్యక్తిని రేణిగుంట మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట బైండ్ ఓవర్ చేయించారు.అయితే, బైండ్ ఓవర్‌లో ఉన్నప్పటికీ 15-09-2026 వ తేదీన అర్ధ రాత్రి బుగ్గ వీది లో మద్యం త్రాగి అక్కడ వినాయక విగ్రహం వద్ద పాటలు పెట్టమని వారి తో గొడవ పడినట్లు విచారణలో నిర్ధారణ కావడంతో అతని పై కేసు నమోదు చేయడం అయినది. అంతట బైండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ దినం అనగా 26-09 -2026న రేణిగుంట మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ శ్రావణ్ కుమార్ ఎదుట హాజరుపరచారు. విచారణ అనంతరం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా సీఐ జయచంద్ర స్పష్టం చేస్తూ రౌడీషీటర్లు, పునరావృత నేరస్థులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు మరియు సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టం ప్రకారం మరింత కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. బైండ్ ఓవర్ వంటి నిరోధక చర్యలను ఉల్లంఘించే వారికి ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు.

ప్రజలు ప్రశాంతంగా జీవించే వాతావరణాన్ని కల్పించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని, నేరాలకు పాల్పడే వారిని చట్టం ముందు నిలబెట్టడంలో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో నేరరహిత, భయరహిత సమాజ నిర్మాణమే తిరుపతి జిల్లా పోలీసుల లక్ష్యమని తెలిపారు.

– జిల్లా పోలీసుల సందేశం

“చట్టాన్ని గౌరవించే ప్రతి పౌరుడికి తిరుపతి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారు. ప్రజల ప్రశాంత జీవితానికి భంగం కలిగించే రౌడీషీటర్లు, పునరావృత నేరస్థులు మరియు సంఘవిద్రోహ శక్తులపై చట్టం తన పని చేస్తుంది. ఎలాంటి ఒత్తిళ్లు,ప్రభావాలకు తావు లేకుండా కఠిన చర్యలు కొనసాగుతాయి.

కుందుర్పమ్మకు దేశవ్యాప్త గుర్తింపు తెద్దాం

హరిత గిరి ప్రదక్షిణను మరింత అభివృద్ధి చేద్దాం - నియోజకవర్గ రూపురేఖలు మారుస్తాం : ఎమ్మెల్యే అమిలినేని



కళ్యాణదుర్గం/కుందుర్పి, సెప్టెంబర్ 26.(రిపబ్లిక్ న్యూస్):

ఆధ్యాత్మికత, ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా కొనసాగుతున్న కుందుర్పమ్మ (శివపురి) హరిత గిరి ప్రదక్షిణకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. గ్రామస్థులు, పెద్దలు, ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ పరిరక్షకులు సమష్టిగా కృషి చేస్తే “ఆంధ్రా అరుణాచలం“గా పేరొందిన కుందుర్పమ్మ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కుందుర్పి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన 11వ హరిత గిరి ప్రదక్షిణను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు రేంజ్ హోంగార్డ్స్ ఎస్పీ హనుమంతు, ప్రకృతి ప్రేమికుడు భాస్కర్‌నాయుడు, లెనిన్‌బాబు, ఎన్నారై డాక్టర్ మాధవి, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

హరితాన్ని పెంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ జరిగే కొండ చుట్టూ భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. దీనిపై కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కుందుర్పి మండలంలో అనేక శివాలయాలు, అమ్మవారి ఆలయాలు ఉన్నాయని, నిత్య పూజలతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందన్నారు. ఆలయాల అభివృద్ధితోపాటు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. చెట్లు ప్రతి ఒక్కరి జీవితానికి అత్యవసరమని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే హరితాన్ని పెంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గిరి ప్రదక్షిణను పర్యావరణ పరిరక్షణతో అనుసంధానించి ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పదేళ్లు సమష్టిగా కష్టపడితే నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయవచ్చన్నారు. రాబోయే మూడు, నాలుగేళ్లలో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. పాఠశాలలు, రహదారులు, పరిశ్రమలతోపాటు సాగునీటి వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

నిర్వహణకు తనవంతుగా రూ.25 వేల ఆర్థిక సహాయం

బీటీపీ కాలువకు భూములు ఇచ్చిన రైతులకు సంబంధించిన రికార్డుల్లో గతంలో లోపాలు ఉండటంతో పరిహారం విషయంలో జాప్యం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రికార్డులను సరిచేసి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం 2028 మార్చి నాటికి బీటీపీ పనులు పూర్తి చేసి నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బీటీపీ నీటితో ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యమన్నారు.కుందుర్పమ్మ ఆలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తనకు వచ్చే వేతనాన్ని అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తానని తెలిపారు. హరిత గిరి ప్రదక్షిణ నిర్వహణకు తనవంతుగా రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు.



ఎన్డీఏ కూటమి సమన్వయ సమావేశంపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మీడియా సమావేశం...





ఆళ్లగడ్డ సెప్టెంబర్ 27రిపబ్లిక్ న్యూస్

నంద్యాల లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జరిగిన ఎన్ డి ఏ కూటమి సమావేశం అనంతరం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.

ఎన్డీఏ కూటమి ఐక్యతే మా లక్ష్యం అన్ని స్థానాల్లో విజయమే ధ్యేయం అన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారానికి త్వరలో మార్గం సుగమం అవుతుందని

ఈరోజు నంద్యాలలో కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి,ప్రభాకర్ చౌదరి, గౌరు చరిత, భాస్కర్ , మధు తదితర ఎన్డీఏ కూటమి నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్తులో కూడా కూటమి నాయకులందరూ సమన్వయంతో ముందుకు వెళ్లే అంశంపై చర్చించడం జరిగింది.తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులందరూ ఎంతో కష్టపడి, ఎన్నో త్యాగాలు చేసి కూటమి విజయానికి కృషి చేశారు. ఆ విషయాన్ని మనమందరంగుర్తుంచుకోవాలి. ప్రతి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, న్యాయం జరిగేలా చూడాలన్నదే మా ఉద్దేశం. ఏ ఒక్క పార్టీకి అన్యాయం జరగకుండా, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నాం.స్థానికంగా ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలు వచ్చినా పెద్దల సమక్షంలో చర్చించిపరిష్కరించుకుంటాం. కూటమి ఐక్యతను కాపాడుకుంటూ రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించే దిశగా సమష్టిగా కృషి చేస్తాం. కార్యకర్తలు, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదు.మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారానికి సంబంధించి కూడా ఈరోజు సమావేశంలో చర్చించడం జరిగింది. ప్రభాకర్ చౌదరి,కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి,గౌరు చరిత,ఇతర నాయకుల సమక్షంలో అన్ని అంశాలను చర్చించాం. గతంలో ఇతర నాయకులకు ఇచ్చిన హామీల కారణంగా కొంత ఆలస్యం జరిగింది. అయితే, సంబంధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని పార్టీ నాయకత్వం హామీ ఇచ్చింది. త్వరలోనే ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రమాణ స్వీకారం జరిగేలా చర్యలు తీసుకుంటాం.వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు మళ్లీ పునరావృతం కాకుండా, ప్రజలకు మెరుగైన పాలన అందించాలన్నదే మా లక్ష్యం. ఎన్డీఏ కూటమి నాయకులందరం ఐక్యంగా పనిచేస్తూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తాం.

ఆళ్లగడ్డ నుంచి ప్రజలకు, కార్యకర్తలకు ఒకటే భరోసా ఇస్తున్నాం. కూటమిలో ఎలాంటి విభేదాలు లేకుండా అందరం కలిసి పనిచేస్తాం. రాబోయే ఎన్నికల్లో ఐక్యంగా పోటీ చేసి విజయం సాధించేందుకు కృషి చేస్తాం అన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888

పెరిగిన పీఎఫ్ వేతన పరిమితి..

మీ శాలరీ, పొదుపుపై ఎలాంటి ప్రభావం ఉంటుంది?

పీఎఫ్ వేతన పరిమితి రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంపు

ఉద్యోగి పీఎఫ్ వాటా రూ.3,000 వరకు పెరిగే ఛాన్స్

సంస్థ వాటా కూడా రూ.3,000 వరకు పెరిగే అవకాశం

ఈపీఎస్ వాటా రూ.2,083 వరకు పెరిగే అవకాశం

అదనపు పొదుపుతో రిటైర్మెంట్ నిధి పెరగొచ్చు



న్యూ ఢిల్లీ సెప్టెంబర్,26(రిపబ్లిక్ న్యూస్)

నెల జీతం వస్తుంది.. ఖర్చులు పోతాయి.. మిగిలిన దాంట్లో కొంత పీఎఫ్‌లోకి వెళుతుంది. ఉద్యోగ జీవితంలో పెద్దగా పట్టించుకోని ఈ చిన్న మొత్తం.. రిటైర్మెంట్ సమయానికి పెద్ద మొత్తంగా మారుతుంది. ఇప్పుడు పీఎఫ్ లెక్కల్లో కీలక మార్పు వచ్చింది. వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచడంతో ఉద్యోగుల నెలవారీ పొదుపు పెరగనుంది. మరి ఈ మార్పుతో మీ జీతం నుంచి ఎంత పీఎఫ్ కట్ అవుతుంది? సంస్థ ఎంత జమ చేస్తుంది? పెన్షన్‌పై ప్రభావం ఏంటి?

అసలు మార్పు ఏంటి?

ఇప్పటివరకు పీఎఫ్ కోసం నెల జీతంలో గరిష్ఠంగా రూ.15 వేలనే పరిగణించేవారు. ఈ మొత్తంపై 12 శాతం చొప్పున ఉద్యోగి, సంస్థ పీఎఫ్‌కు రూ.1,800 చొప్పున చెల్లించేవారు. ఇప్పుడు ఈ పరిమితిని రూ.25 వేలకు పెంచారు. అంటే 12 శాతం లెక్కన ఉద్యోగి వాటా రూ.3,000 వరకు పెరగొచ్చు. సంస్థ కూడా రూ.3,000 వరకు జమ చేయొచ్చు. దీంతో పీఎఫ్ ఖాతాలోకి వెళ్లే మొత్తం పెరుగుతుంది.

ఎవరికి ఎక్కువ ప్రయోజనం?

బేసిక్ జీతం, డీఏ కలిపి రూ.15 వేల నుంచి రూ.25 వేల మధ్య ఉన్న ఉద్యోగులకు ఈ మార్పు ఎక్కువగా ఉపయోగపడొచ్చు. గతంలో రూ.15 వేల వరకు మాత్రమే పీఎఫ్ లెక్కించేవారు. ఇక కొత్త పరిమితి వర్తించే చోట రూ.25 వేల వరకు లెక్కిస్తారు. అయితే ఇప్పటికే పూర్తి బేసిక్ జీతంపై పీఎఫ్ చెల్లిస్తున్న ఉద్యోగులకు ఈ మార్పుతో ప్రత్యేకంగా అదనపు ప్రభావం ఉండదు.

పెన్షన్ వాటా కూడా పెరుగుతుంది

పీఎఫ్‌లో సంస్థ చెల్లించే 12 శాతం మొత్తంలో కొంత భాగం ఉద్యోగుల పెన్షన్ పథకం (ఈపీఎస్)కు వెళుతుంది. గతంలో రూ.15 వేల పరిమితిపై 8.33 శాతం లెక్కన నెలకు గరిష్ఠంగా రూ.1,250 ఈపీఎస్‌కు వెళ్లేది.

ఇప్పుడు పరిమితి రూ.25 వేలకు పెరగడంతో ఈపీఎస్ వాటా నెలకు రూ.2,083 వరకు పెరిగే అవకాశం ఉంది. దీంతో ఉద్యోగి భవిష్యనిధితో పాటు పెన్షన్ ప్రయోజనం కూడా పెరిగే అవకాశం ఉంటుంది.


దీర్ఘకాలంలో ఏం జరుగుతుంది?

పీఎఫ్‌లో ప్రతి నెల అదనంగా జమయ్యే మొత్తం చిన్నదిగా కనిపించొచ్చు. కానీ అది సంవత్సరాల పాటు ఖాతాలో కొనసాగుతుంది. దానిపై వచ్చే వడ్డీ కూడా మళ్లీ జమవుతుంది. దీంతో కాలం గడిచేకొద్దీ పొదుపు మొత్తం పెరుగుతుంది.

అందుకే కొత్త పీఎఫ్ పరిమితి వల్ల ఉద్యోగుల చేతికి వచ్చే జీతం కొంత తగ్గినా.. భవిష్యత్ పొదుపు పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఉద్యోగ జీవితంలో ఇంకా చాలా సంవత్సరాలు ఉన్నవారికి ఈ అదనపు పీఎఫ్ జమ దీర్ఘకాలంలో ఉపయోగపడొచ్చు.

ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?


బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు



న్యూ ఢిల్లీ సెప్టెంబర్.26(రిపబ్లిక్ న్యూస్)

అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున్న ధన్‌తేరస్, దీపావళి వంటి కీలక పండగల నేపథ్యంలో ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో, 2026 మే నెలలో మోదీ తొలిసారి ఈ విజ్ఞప్తి చేశారు. తాజాగా సెప్టెంబర్‌లోనూ ఆయన ఇదే విషయాన్ని గుర్తుచేశారు. భారత్ తన అవసరాలకు సంబంధించి అత్యధిక శాతం బంగారాన్ని దిగుమతుల ద్వారానే పొందుతోంది. 2026 రెండో త్రైమాసికంలో దేశీయ సరఫరాలో 82 శాతం దిగుమతుల నుంచే లభించింది. దీనివల్ల డాలర్ల రూపంలో చెల్లింపులు పెరిగి, సుమారు 780 నుంచి 785 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది.ప్రధాని విజ్ఞప్తి ప్రభావం ఇప్పటికే కొంతమేర కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అనవసర కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా బంగారం అమ్మకాల పరిమాణం సుమారు 15 శాతం మేర తగ్గింది. వినియోగదారులు ఎక్కువగా తేలికపాటి ఆభరణాలను ఎంచుకోవడం లేదా పాత బంగారాన్ని మార్చుకోవడం వంటి పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు.పండగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం అనేది సంప్రదాయం, భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందని గ్రోత్‌వైన్ క్యాపిటల్ నిపుణుడు శుభమ్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే తగినంత బంగారం ఉన్నవారు ఈసారి లాంఛనంగా కొద్ది మొత్తంలో కొనుగోలు చేయడం మేలని ఆయన సూచించారు. కేవలం పెట్టుబడి కోసమైతే, భౌతిక బంగారానికి బదులుగా గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమ ప్రత్యామ్నాయాలని ఆయన వివరించారు. ఏదేమైనా, ప్రధాని పిలుపునకు అసలైన పరీక్ష రాబోయే పండగల సీజన్‌లోనే ఎదురుకానుంది.

నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం.. రెండు రోజుల్లో 19 మంది మృతి



సెప్టెంబర్,26(రిపబ్లిక్ న్యూస్)

నాగాలాండ్‌లో కల్తీ మద్యం అనుమానిత ఘటనలు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల్లో మద్యం సేవించిన తర్వాత 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మొకోక్‌చుంగ్ జిల్లాలో 8 మంది, ట్యూన్‌సాంగ్ జిల్లాలో 11 మంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ ఐ.బంగ్‌లాంగ్ చాంగ్ నేతృత్వంలో ఈ బృందం పనిచేయనుంది. అనుమానిత కల్తీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? దాని సరఫరా వెనుక ఎవరున్నారు? అనే అంశాలను సిట్ దర్యాప్తు చేస్తోంది.మద్యం నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల కోసం గువాహటికి పంపించారు. మరణాలకు అసలు కారణం ఏంటో పరీక్షల తర్వాత స్పష్టమవుతుందని పోలీసులు తెలిపారు. కొన్ని ఆధారాలు లభించాయని, అయితే దర్యాప్తు ప్రారంభ దశలో ఉన్నందున వివరాలు వెల్లడించలేమని సీనియర్ ఎస్పీ వెసుప్రా కెజో తెలిపారు.మరణాల నేపథ్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 19 మందిని అరెస్టు చేశారు. దాదాపు 3 వేల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.గుర్తుతెలియని, లేబుల్ లేని లేదా అనుమానిత అక్రమ మద్యాన్ని తాగవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. మద్యం తాగిన తర్వాత తల తిరగడం, చూపు మసకబారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని హెచ్చరించారు. నాగాలాండ్‌లో 1990 నుంచి మద్య నిషేధ చట్టం అమల్లో ఉంది.

నకిలీ ఆధార్‌లకు చెక్..

డూప్లికేట్ ఆధార్ల భరతం పట్టేందుకు దేశీయ టెక్నాలజీ

నకిలీ ఆధార్ కార్డుల గుర్తింపునకు 'భారత్ ఏబీఐఎస్' అనే కొత్త వ్యవస్థ

యూఐడీఏఐ పరిశోధకుల ఆధ్వర్యంలో దేశీయంగా అభివృద్ధి

పరీక్షల్లో నిర్దేశిత లక్ష్యాలను మించి అత్యుత్తమ ఫలితాలు

భారత పూర్తి డేటాబేస్‌పై ఇంకా విస్తృత పరీక్షలు జరగాల్సి ఉందన్న నిపుణులు



న్యూ ఢిల్లీ సెప్టెంబర్,26(రిపబ్లిక్ న్యూస్)

దేశంలో ఆధార్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా భారత పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. నకిలీ ఆధార్ కార్డులను అత్యంత కచ్చితత్వంతో గుర్తించేందుకు 'భారత్ ఏబీఐఎస్' (దీస్ఘుతీఖ్ ూాదీ×ూా) అనే సరికొత్త ఓపెన్ సోర్స్ బయోమెట్రిక్ వ్యవస్థను అభివృద్ధి చేశారు.

యూఐడీఏఐతో సంబంధం ఉన్న పరిశోధకులు, ఐఐఐటీ హైదరాబాద్, మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ నిపుణుల బృందం సంయుక్తంగా ఈ టెక్నాలజీని రూపొందించింది. ఇది దేశవ్యాప్తంగా ఆధార్ డేటాబేస్‌లో డూప్లికేట్ ఎంట్రీలను ఏరివేయడంలో కీలకంగా మారనుంది.'భారత్ ఏబీఐఎస్' అనేది వేలిముద్రలు, కనుపాప (ఐరిస్), ముఖ కవళికలను కలిపి బయోమెట్రిక్స్‌ను విశ్లేషించే ఒక మల్టీ-మోడల్ వ్యవస్థ. ఈ మూడు డేటాలను కలిపి ప్రతి వ్యక్తికి కేవలం 13.5 ఖదీ పరిమాణంలో ఒక టెంప్లేట్‌ను ఇది సృష్టిస్తుంది. దేశంలోని మొత్తం 155 కోట్ల ఆధార్ ఎంట్రీల నుంచి నమూనాగా సేకరించిన 22 కోట్ల డీ-ఐడెంటిఫైడ్ రికార్డులపై ఈ వ్యవస్థను పరీక్షించారు.ముఖ్యంగా 2 కోట్ల రికార్డుల సబ్‌సెట్‌పై జరిపిన పరీక్షల్లో ఇది అద్భుతమైన ఫలితాలను కనబరిచింది. తప్పుడు గుర్తింపుల రేటు (ఎఫ్‌పీఐఆర్) కేవలం 0.1 శాతంగా, అసలైన వాటిని గుర్తించడంలో వైఫల్యం రేటు (ఎఫ్ఎన్ఐఆర్) 0.05 శాతంగా నమోదైంది. ఈ ఫలితాలు యూఐడీఏఐ నిర్దేశించిన 0.5% ఎఫ్‌పీఐఆర్, 0.1% ఎఫ్ఎన్ఐఆర్ లక్ష్యాల కన్నా చాలా మెరుగ్గా ఉండటం గమనార్హం. ఎఫ్‌పీఐఆర్, ఈ వ్యవస్థ రూపకల్పనలో ఓపెన్ సోర్స్ భాగాలను వినియోగించడం వల్ల ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. డేటా ప్రాసెసింగ్, నాణ్యత అంచనా, ఫేక్ బయోమెట్రిక్స్‌ను గుర్తించడం వంటి పనుల కోసం ఓపెన్ సోర్స్ టూల్స్‌నే వాడారు. భారీ డేటాబేస్‌లో శోధన ప్రక్రియ వేగంగా జరిగేందుకు సర్వర్లపై పనిభారాన్ని సమానంగా పంపిణీ చేసే ఒక ప్రత్యేక షెడ్యూలర్‌ను కూడా ఇందులో పొందుపరిచారు.

వాణిజ్యపరంగా అందుబాటులో ఉన్న మూడు ప్రముఖ వ్యవస్థలతో పోల్చినప్పుడు 'భారత్ ఏబీఐఎస్' వాటికి సమానమైన లేదా అంతకంటే మెరుగైన కచ్చితత్వాన్ని చూపించింది. 8 ఎన్విడియా ఎ100 జీపీయూలు, 2 టీబీ ర్యామ్‌తో కూడిన ఒక్క సర్వర్‌పై 4 కోట్ల రికార్డుల గ్యాలరీలో సెకనుకు 100 శోధనలు చేయగల సామర్థ్యం దీనికి ఉంది.దేశంలో డూప్లికేట్ ఆధార్ కార్డులు ఇప్పటికీ ఒక సవాలుగానే ఉన్నాయి. 2022లో ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ దాదాపు 6 లక్షల నకిలీ ఆధార్ కార్డులను గుర్తించి రద్దు చేసినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో 'భారత్ ఏబీఐఎస్' ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోని 'డీప్‌ప్రింట్' ఫింగర్‌ప్రింట్ మోడల్.. వృద్ధులు, చేతివేలిముద్రలు అరిగిపోయిన శ్రామికుల బయోమెట్రిక్ ప్రామాణీకరణ వైఫల్యాలను సగానికి తగ్గించగలదని పరిశోధకులు తెలిపారు. అయితే, ఈ వ్యవస్థ అద్భుతమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ, దేశంలోని పూర్తి ఆధార్ డేటాబేస్‌పై దీనిని ప్రయోగించడానికి ముందు మరిన్ని విస్తృత స్థాయి పరీక్షలు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో 2 కోట్ల లోపు జనాభా ఉన్న దేశాలకు ఇది తక్కువ ఖర్చుతో కూడిన సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా ఉపయోగపడగలదని వారు పేర్కొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు మరింత సమయం ఇవ్వండి

: లోక్‌సభ స్పీకర్ కు జితిన్ రామ్ మాంజీ లేఖ



న్యూ ఢిల్లీ సెప్టెంబర్,26(రిపబ్లిక్ న్యూస్)

పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీల గళానికి మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కేంద్ర మంత్రి, ఎన్డీఏ మిత్రపక్ష నేత జితన్ రామ్ మాంజీ ఒక లేఖ రాశారు. పార్లమెంట్‌లో అత్యంత కీలకమైన బిల్లులపై చర్చ జరిగే తరుణంలో, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలకు సభలో మాట్లాడేందుకు మరికొంత అదనపు సమయం కేటాయించాలని ఆయన ఆ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఎన్డీఏ ఎంపీలతో నిర్వహించిన ఒక సమావేశంలో ఈ ప్రధానాంశం చర్చకు వచ్చినట్లు మాంజీ వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ ఈ ప్రస్తావన తెచ్చారని తెలిపారు. తమ సామాజిక వర్గానికి చెందిన ప్రత్యేక సమస్యలు, అంశాలను సభలో వివరంగా ప్రస్తావించేందుకు ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు తగినంత సమయం అవసరమని పటేల్ కోరినట్లు మాంజీ తన లేఖలో ప్రస్తావించారు.ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ చేసిన ఈ అభ్యర్థనను సీరియస్‌గా పరిగణించి, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన స్పీకర్‌ను కోరారు. మరోవైపు, సభలో తమకు అసలు సమయమే కేటాయించడం లేదని తాము అనడం లేదని.. తమ వర్గాల సమస్యలపై మరింత లోతుగా చర్చించేందుకు కేటాయించిన సమయాన్ని మరింత పెంచాలని మాత్రమే కోరుతున్నట్లు ఎంపీ పటేల్ గతంలో ఒక మీడియాతో మాట్లాడుతూ స్పష్టం చేశారు.

రూ.300 దర్శనం టికెట్లపై ఆ ప్రచారం నమ్మొద్దు.. భక్తులకు టీటీడీ విజ్ఞప్తి

సెప్టెంబర్,26(రిపబ్లిక్ న్యూస్)


శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్‌పై భక్తుల నుంచి వస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం సుదీర్ఘ వివరణ ఇచ్చింది. ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ సాంకేతికంగా అత్యంత పటిష్ఠంగా ఉందని, అయితే అందుబాటులో ఉన్న టికెట్ల కోటాకు మించి దాదాపు 9 రెట్లు అధికంగా డిమాండ్ ఉండటమే సమస్యకు ప్రధాన కారణమని స్పష్టం చేసింది. క్షణాల్లో టికెట్లు అయిపోవడాన్ని వ్యవస్థ వైఫల్యంగా భావించవద్దని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

గణాంకాలతో వాస్తవ పరిస్థితి వెల్లడి

టికెట్ల విడుదల సమయంలో వాస్తవంగా ఏం జరుగుతుందో టీటీడీ గణాంకాలతో సహా వివరించింది. దర్శన టికెట్ల బుకింగ్ కోసం ఒకేసారి సుమారు 6 లక్షల మంది యూజర్లు వెబ్‌సైట్‌లోకి వస్తున్నారని తెలిపింది. ఒక్కో యూజర్ సగటున తమ కుటుంబ సభ్యుల కోసం నాలుగు టికెట్లకు ప్రయత్నించినా, మొత్తం డిమాండ్ సుమారు 24 లక్షల టికెట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. అయితే, టీటీడీ విడుదల చేసే కోటా కేవలం 2.69 లక్షల టికెట్లు మాత్రమే. అంటే, అందుబాటులో ఉన్న ప్రతి టికెట్‌కు సగటున 9 మంది పోటీ పడుతున్నారని, ఈ తీవ్రమైన పోటీ కారణంగానే చాలా మందికి టికెట్లు లభించడం లేదని పేర్కొంది.

వర్చువల్ క్యూ భద్రతకే, అడ్డంకి కాదు

బుకింగ్ సమయంలో భక్తులను కొంతసేపు నిరీక్షించేలా చేసే 'వర్చువల్ క్యూ' విధానంపై కూడా టీటీడీ స్పష్టత ఇచ్చింది. ఇది టికెట్లను నిరాకరించడానికి కాదని, ఒకేసారి లక్షలాది అభ్యర్థనలు వచ్చి సర్వర్లపై భారం పడకుండా, మొత్తం వ్యవస్థ స్థిరత్వాన్ని కాపాడేందుకు ఏర్పాటు చేసిన సాంకేతిక విధానమని తెలిపింది. గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్, ఆటో స్కేలింగ్, లోడ్ బ్యాలెన్సింగ్ వంటి ఆధునిక టెక్నాలజీతో ఆన్‌లైన్ వ్యవస్థను నిర్వహిస్తున్నామని, ప్రత్యేక టెక్నికల్ వార్-రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించింది.



అదేవిధంగా, పేమెంట్ విఫలమవడం పూర్తిగా టీటీడీ పరిధిలోని అంశం కాదని, ఇది పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకులు, యూపీఐ నెట్‌వర్క్‌ల పనితీరుపై కూడా ఆధారపడి ఉంటుందని గుర్తుచేసింది. టికెట్లు అందుబాటులో లేకపోవడం వల్ల వచ్చే 'స్లాట్ అన్‌అవైలబుల్' సందేశాన్ని సాంకేతిక లోపంగా పరిగణించరాదని కోరింది. శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వంటి ఇతర ఆలయాల బుకింగ్ ప్రక్రియ ఇదే వ్యవస్థ ద్వారా సజావుగా సాగుతోందని, అక్కడ డిమాండ్ తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని ఉదహరించింది.

భక్తుల ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని, యాంటీ-బాట్ మెకానిజమ్స్, సెక్యూరిటీ, పేమెంట్ ప్రక్రియలను నిరంతరం మెరుగుపరుస్తున్నామని టీటీడీ హామీ ఇచ్చింది. భారీ డిమాండ్ ఉన్నప్పుడు ప్రతి ఒక్కరికీ టికెట్ లభించడం సాధ్యం కాదని, ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలని కోరింది. టీటీడీపై సోషల్ మీడియాలో జరిగే అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని, భక్తులకు పారదర్శకమైన, సురక్షితమైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

గుర్తింపుకు నోచుకోని టిడిపి వీరాభిమాని

రైల్వే కోడూరు సెప్టెంబర్ 26 రిపబ్లిక్ న్యూస్.



తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీని నమ్ముకొని పార్టీ కోసం నిరంతరం అలుపెరుగని కృషి చేస్తున్న టిడిపి పార్టీ వీర అభిమాని ఉమ్మల రాజు పిచ్చి రాజు, ఈయన ఓబులవారిపల్లి మండలం బొమ్మ వరం గ్రామస్తుడు మోస్ట్ సీనియర్టి డి పీ నాయకుడు ఉమ్మల రాజు పిచ్చిరాజు, ఒకప్పుడు బొమ్మ వరం పంచాయతీ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదని అలాంటి పంచాయతీని టిడిపికి అనుకూలముగా మార్చిన ఘనత పిచ్చి రాజుకు దక్కుతుందని గ్రామస్తులు అంటున్నారు, 2014లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బొమ్మ వరం గ్రామాన్ని సందర్శించినప్పుడు ఆయనకు పిచ్చిరాజు ఘన స్వాగతం పలికారని, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావునుండి ఇప్పటివరకు పార్టీని నమ్ముకుని పార్టీకి సేవ చేస్తున్నానని అయినప్పటికీ పార్టీ నన్ను గుర్తించలేదని ఉమ్మల రాజు పిచ్చి రాజు ఆవేదన వ్యక్తం చేశారు, తెలుగుదేశం పార్టీ అంటే ఉమ్మల రాజు పిచ్చి రాజు అని, పిచ్చి రాజు అంటే తెలుగుదేశం పార్టీ అనే అంతలా పార్టీలో కరుడుగట్టిన కార్యకర్త అని, అలాంటి కార్యకర్తకు ఎలాంటి గుర్తింపు లేకపోవడం విచారకరమని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు, ఇకనైనా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయనకు అధిష్టానం సరైన గుర్తింపు ఇచ్చి ఆయన సేవలను పార్టీ ఉపయోగించుకోవాలని స్థానికులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు, పంచాయతీలో ఎంతోమంది సుదీర్ఘ తెలుగుదేశం పార్టీ చరిత్రలో బొమ్మ వరంలో పార్టీలో మారిన వారు ఎంతో మంది ఉన్నారని,కానీ ఉమ్మల రాజు పిచ్చి రాజు ఊపిరి ఉన్నంతవరకు తెలుగుదేశంతోనే ఉంటానని గ్రామంలో అందరిని కలుపుకొని పార్టీ అభివృద్ధి కోసం గెలుపు కోసం నిరంతరం కృషి చేస్తున్న నిజాయితీ కలిగిన కార్యకర్త అని గ్రామస్తులు అన్నారు,ం

ప్రజా అవసరాల దృష్ట్యా హై లెవెల్ బ్రిడ్జి గేటు ఏర్పాటు చేయండి.

తల్లెం భరత్ కుమార్ రెడ్డి





రైల్వే కోడూరు సెప్టెంబరు 26 రిపబ్లిక్ న్యూస్. రైల్వే కోడూరు మండలం ఉల్లగట్టు పాడు పంచాయతీ గ్రామ ప్రజలకు రాకపోకలకు తీవ్ర అసౌకర్యముగా ఉన్న రైల్వే ఎల్ సి గేట్ 85 ను త్వరితగతిన ఆధునికరించి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రాజంపేట పార్లమెంటు సభ్యుడు మిథున్ రెడ్డిని శనివారం ఆయన స్వగృహంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు రాయలసీమ వైఎస్ఆర్సిపి బూత్ కమిటీ కన్వీనర్, గుంతకల్లు డి ఆర్ యు సి సి సభ్యుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి అన్నారు,రైల్వే కోడూరు మండలం ఉలగడ్డపాడు గ్రామపంచాయతీ నందు రైల్వే ఎల్ సి గేట్ నెంబర్ 85 తరచూ గేటు మూసినప్పుడల్లా ప్రజల రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారని హై లెవెల్ బ్రిడ్జి గేటు ఏర్పాటు చేయాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి గతంలో రైల్వే శాఖ అధికారులకి లెటరు ఇవ్వడం జరిగిందని, ఇక్కడ రానున్న రోజుల్లో గ్రీన్ ఫీల్డ్ ఎన్హెచ్ హైవే కి ఉల్లగడ్డ పోడు రైల్వే గేట్ వద్ద హైవే కనెక్టివిటీగా హై లెవల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది, ఇక్కడ ఉన్నటువంటి రైతులకి ప్రజలకి మరియు చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు కూడా రాకపోకలకు అవసరం పడుతుందని గేటు మీదుగా హైవేలోకి కలపాలని విజ్ఞప్తి చేశారు,అంతేకాకుండా ఇప్పుడు అందుకు సంబంధించిన స్కెచ్ ని ఎంపీ దృష్టికి తీసుకురావడం జరిగింది,త్వరలోనే ఈ హై లెవెల్ బ్రిడ్జి తొందరగా ఏర్పాటు చేసి ప్రజలకి సౌకర్యార్థంగా నిర్మించాలని ఎంపీ మరొకసారి రైల్వే శాఖకు తెలియజేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు,ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు నియోజకవర్గ వాణిజ్య విభాగా అధ్యక్షుడు రమేష్, పుల్లంపేట మండల బూత్ కమిటీ అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్ రెడ్డి,వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మాదినేని వెంకటరెడ్డి,రమణ,శీను,తదితరులు పాల్గొన్నారు

శ్రీ శ్రీ శ్రీ కంచమ్మ తల్లి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం.





రైల్వే కోడూరు సెప్టెంబర్ 26 రిపబ్లిక్ న్యూస్.

రైల్వే కోడూరు మండలం ఓబనపల్లి పంచాయతీ ఓబనపల్లి గ్రామం లో శ్రీ శ్రీ శ్రీ కంచమ్మ తల్లి ఆలయంలో ప్రతి ఏడాది ప్రతి పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు,ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన సేవను అందించి నిర్వాహకులు తమ సేవాభావాన్ని చాటుకున్నారు ఓబనపల్లెకు చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు కంచమ్మ తల్లిని దర్శించుకుని తమ మొక్కలను తీర్చుకొన్నారు,ఈ కార్యక్రమం ఓ మణేయ్య, ఎన్ చిన్నయ్య, ఎన్ గంగయ్య,జి ప్రసాద్, ఎన్ శివరామయ్య, ఎన్ సుబ్బరామయ్య,గడ్డం శ్రీరాములు ఆధ్వర్యంలో ఘనంగా ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉండదని నిర్వాహకులు తెలియజేశారు, ప్రతి పౌర్ణమి రోజున భక్తులకు అన్నదానం నిర్వహించడం ఆనందదాయకమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ పూజారి చిన్నయ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కంచమ్మ తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

టీ డి పి సీనియర్ నాయకుడు భార్గవ్ రామ్ నాయుడిని సన్మానించిన బృందావనం కాలనీ వాసులు



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 27 రిపబ్లిక్ న్యూస్ ఆళ్లగడ్డ పట్టణంలోని బృందావనం కాలనీ కి నూతనంగా 9 సిసి రోడ్లు మంజూరు అవడంతో, బృందావన కాలనీవాసులందరూ ఆళ్లగడ్డ టిడిపి సీనియర్ నాయకుడు భార్గవ్ రామ్ ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది, అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

రాయికల్లో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన రజక సంఘ సభ్యులు

రాయికల్ మండలం సెప్టెంబర్,26(రిపబ్లిక్ న్యూస్)



మన హక్కుల కోసం పోరాడితే పోయేది ఏమీ లేదు అని దానికి ఆడ మగ అని లేకుండా పోరాట చేసి మన హక్కులు సాధించుకోవాలి అని జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి రజక సంఘ సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోజు ఐలమ్మ తిరుగ పడకుంటే మన వెట్టి చాకిరి అలాగే ఉంటుండేదని భూస్వాముల దోపిడీ,దొరల అరాచకాలను,ఏదురోడ్డి నిజాం నిరంకుశ పాలన రజాకారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా భూమి బుక్తి కి వెట్టి చాకిరి విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటాన్ని ఈ సందర్భంగా అందరు సుమరించుకున్నారు ఈ కార్యక్రమంలో రజక సంఘ సభ్యులు దరి,గంగాధర్, రమేష్, నాగరాజు, వెంకటేష్, రాజు లు ఉన్నారు

రాయికల్ పట్టణ ఆరో వార్డులో పోషక దినోత్సవాని కి హాజరైన కౌన్సిలర్ వేముల మౌనిక రాము

రాయికల్ మండలం సెప్టెంబర్,26(రిపబ్లిక్ న్యూస్)



ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంగన్వాడి కేంద్రాలు ద్వారా పోషకాహారము చిన్నపిల్లలకు చదువుతూ వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆరో వార్డు కౌన్సిలర్ వేముల మౌనిక రాము అన్నారు జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ ఆరో వార్డులో ఎనిమిదవ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం వేడుకల సందర్భంగా షెడ్యూల్ ప్రకారం ఆరో వార్డులో జరిగింది కౌన్సిలర్ వేముల మౌనిక రాము కార్యక్రమానికి హాజరయ్యారు ఈ సందర్భంగా వేముల మౌనిక రాము మాట్లాడుతూ నవజాత శిశు సంరక్షణ పుట్టిన వెంటనే బిడ్డ కంగారుగా పద్ధతిలో పాలు పట్టడం మరియు ఎత్తుకునేటప్పుడు ముందుగా చేతులు సబ్బుతోటి కడుక్కొని బిడ్డని ఎత్తుకోవాలని బిడ్డ ఏడ్చిన ప్రతిసారి తల్లిపాలు పట్టించి ఒకవేళ ఎక్కువసేపు పడుకున్నట్టయితే పాదాలను తట్టి లేపి మరి పాల్పట్టాలని తెలియజేశారు రెండు సంవత్సరాల ఆరు నెలలు నిండిన పిల్లల్ని అంగన్వాడి కేంద్రానికి పంపాలని వారి కావాల్సిన ఆటపాటలను నేర్పిస్తము పుస్తకాలు భూమ్మల ఆటతో వారికి విద్యను అభ్యసిస్తారని బాల్యదశ లో అన్ని నేర్పిస్తానని పిల్లలకు గుడ్లు టచ్ బ్యాడ్ టచ్ గురించి కూడా తెలియపరిచినారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ పద్మ,ఉమాదేవి, రమాదేవి, ఆయమ్మ సుభద్ర తల్లులు పిల్లలు హాజరైనారు

రామ్ నగర్ రాజీవ్ యూత్ వినాయకుని లడ్డువేలంలో రాయికల్ పారిశ్రామిక వేత్త పాలడుగు సుభాష్ రెడ్డి హైమావతి 23,116 రూపాయలకు కైవసం



రాయికల్ మండలం సెప్టెంబర్,26(రిపబ్లిక్ న్యూస్)

కరీంనగర్ రాంనగర్ లోని రాజీవ్ యూత్ వారి వినాయకుని వద్ద లడ్డు వేలంలో జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ పారిశ్రామికవేత్త పాలడుగు సుభాష్ రెడ్డి హైమావతి ₹23,116 రూపాయల వేలంలో వినాయకుని లడ్డూ ప్రసాదం దక్కించుకున్నారు ఈ సందర్భంగా పాలడుగు సుభాష్ రెడ్డి మాట్లాడుతూ అన్ని దేవుళ్ళ కన్నా ముందు కొలిచేది విఘ్నేశ్వరున్ని ఆయన దీవెనలు నాకు ఎల్లప్పుడూ ఉంటాయని అందుకే ఈసారి లడ్డూ వేలంలో పాల్గొని గణేశు లడ్డును కైవసం చేసుకున్నాను అని సంతోషంగా తెలిపారు అవసరమైతే ఎక్కువ రూపాయలు వేలంలో ఉన్న నేను తీసుకువటానికి సిద్ధంగా ఉన్నానని తీసుకోవడం జరిగింది

మా పాలడుగు కుటుంబ సభ్యులకు వినాయకుని అనుగ్రహం ఉంటుందని అలాగే ఉండాలని కోరుకున్నాను అని పారిశ్రామికవేత్త పాలడుగు సుభాష్ రెడ్డి అన్నారు

తెలంగాణ మహిళా చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ ఘన నివాళులు





రాయికల్ మండలం సెప్టెంబర్,26 (రిపబ్లిక్ న్యూస్)

తెలంగాణ మహిళా చైతన్యానికి ప్రతీక, సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నాయకురాలు ఆడువాల జ్యోతి లక్ష్మణ్ ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ కేవలం ఒక వ్యక్తి కాదని, అణచివేతపై పెల్లుబికిన తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. తన హక్కుల కోసం ధైర్యంగా తిరగబడి, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా పోరాడి, రైతులు, పేదలు, మహిళల హక్కుల కోసం నిలిచిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు.రైతులు, పేదలు, మహిళల సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రస్థానంలో చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మనకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు.ఐలమ్మ గారి త్యాగాలను, పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ ప్రజల కోసం మరింత అంకితభావంతో పనిచేయాలని జ్యోతి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయురాలు చాకలి ఐలమ్మకు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.

అర్హులందరూ చేయూత పెన్షన్ కు దరఖాస్తు చేసుకోవాలి.



మల్లాపూర్ సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్)

రేగుంట గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్ అందేలా మల్లాపూర్ ఇరిగేషన్ ఏఈ రాజేష్ వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించి, వారికి పెన్షన్ అందేలా దగ్గరుండి పరిశీలన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, పంచాయతీ కార్యదర్శి వినిత, కారోబార్ సుధాకర్ పాల్గొన్నారు.


ఘనంగా ఐలమ్మ జయంతి వేడుకలు



మల్లాపూర్ సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్)

మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి శ్రీ చిట్యాల (చాకలి) ఐలమ్మ 131 వ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వేములవాడ దేవరాజం, ఉపాధ్యాక్షుడు వేములవాడ శేఖర్, సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, పాలకవర్గ సభ్యులు మహమ్మద్ బషీర్, బాస రాజరెడ్డి, కలసాని రాజన్న, కత్తి నరేష్, కారోబార్ సుధాకర్ మాజీ సర్పంచ్ రంగు రామాగౌడ్, నిమ్మల జలందర్, బండారి వెంకటేష్ మరియు రజక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్కు జనసేన పార్టీ కోఆర్డినేటర్‌గా బెక్కం జనార్ధన్



రాయికల్ మండలం సెప్టెంబర్,26 (రిపబ్లిక్ న్యూస్)

హన్మకొండ ఉమ్మడి వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా జనసేన పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా జగిత్యాల నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి బెక్కం జనార్ధన్ నియమితులయ్యారు.

ఈ సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు ఆయనకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ఆయనకున్న అనుభవం, పట్టుదల, నాయకత్వ లక్షణాలతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. పట్టభద్రుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. “బాధ్యత పెరిగింది.. పోరాటం మరింత పదునెక్కింది” అంటూ జనసేన శ్రేణులు పేర్కొన్నారు.

ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు గనవేని నందిని మల్లేష్ యాదవ్ ను పరామర్శించిన ANL పార్సిల్ వైస్ చైర్మన్ హిమవంత రావ్



మల్లాపూర్ సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్)

రేగుంట ఉప సర్పంచ్, ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు గనవేని నందిని మల్లేష్ యాదవ్ తండ్రి మల్లయ్య ఇటీవల మరణించగా నేడు రేగుంటలో మల్లయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి మల్లేష్ యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపిన సాయ్యప్ప ట్రస్ట్ వైస్ చైర్మన్, ANL పార్సిల్ వైస్ చైర్మన్ హిమావంత రావ్..అయన వెంట పుట్కమ్ రాజారెడ్డి, మాజీ సర్పంచ్ కుందేళ్ల నర్సయ్య, ఇట్టేడి సంజీవ్ రెడ్డి, కాటిపల్లి రవీందర్, సామ లక్పతి రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పరిశ్రమల స్థాపనలో జాప్యానికి తావులేకుండా చర్యలు

భూకేటాయింపులు పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలి: మంత్రి టీజీ భరత్ గుప్తా

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 26)
జిల్లాలో పరిశ్రమల స్థాపనలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టి, భూకేటాయింపులు పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అధికారులను ఆదేశించారు.

కర్నూలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరితో కలిసి పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో మంత్రి పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టుల పురోగతి, భూకేటాయింపులు, అనుమతులు, మౌలిక వసతులు, విద్యుత్ సరఫరా, నైపుణ్య శిక్షణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.





జిల్లాలో ప్రభుత్వం కుదుర్చుకున్న ఎంవోయూలకు సంబంధించిన 42 ప్రాజెక్టుల్లో 11 ప్రాజెక్టుల పనులు ప్రారంభమైనట్లు అధికారులు వివరించారు. మిగిలిన ప్రాజెక్టులను కూడా డిసెంబర్ 10వ తేదీలోగా గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు, భూకేటాయింపులు పొందిన పరిశ్రమలు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి నిర్దిష్ట కాలవ్యవధిలో ప్రాజెక్టులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

భూకేటాయింపులు పూర్తయినా ఫౌండేషన్ పనులు ప్రారంభించని ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్మాణ పనులకు అడ్డంకిగా ఉన్న సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూమి చెల్లింపులు, రిజిస్ట్రేషన్, భూస్వాధీనం, అనుమతులు, విద్యుత్ సరఫరా తదితర సమస్యలను పరిశ్రమల ప్రతినిధులు నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

జిల్లాలో చేపడుతున్న సోలార్, విండ్, బ్యాటరీ స్టోరేజ్ తదితర పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల పురోగతిని కూడా సమావేశంలో సమీక్షించారు. భూసేకరణ, గ్రిడ్ కనెక్టివిటీ, అనుమతులు, ప్రాజెక్టుల కాలపట్టికపై పరిశ్రమల ప్రతినిధుల నుంచి వివరాలు సేకరించారు. పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా అవసరమైన మౌలిక వసతులు, అనుమతులు, ప్రభుత్వపరమైన ప్రక్రియలను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

'నైపుణ్యం' పోర్టల్‌లో పరిశ్రమలు నమోదు కావాలి

పరిశ్రమల నుంచి వచ్చిన 101 ఉద్యోగ ఖాళీలకు 750 మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. స్థానిక నిరుద్యోగ యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి, కలెక్టర్ సూచించారు.

'నైపుణ్యం' పోర్టల్‌లో జిల్లాలోని నిరుద్యోగ యువత వివరాలు, రెజ్యూమేలు అందుబాటులో ఉన్నందున పరిశ్రమల ప్రతినిధులు వాటిని పరిశీలించి అర్హులను ఎంపిక చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని పరిశ్రమలు తప్పనిసరిగా పోర్టల్‌లో ఆన్‌బోర్డ్ అయి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ, సేఫ్టీ స్టీవార్డ్స్ తదితర విభాగాల్లో శిక్షణ అందించేందుకు ఐటీఐలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ఇతర విద్యాసంస్థలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఏడు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఏడు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అనుమతులు లభించినట్లు అధికారులు తెలిపారు. ఆయా పార్కులకు స్థలాల గుర్తింపు, భూకేటాయింపు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. గుట్టపాడు తదితర ప్రాంతాల్లో స్థలాల కేటాయింపు జరిగినట్లు వివరించారు.

మిగిలిన ఎంఎస్ఎంఈ పార్కులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి తదుపరి కార్యాచరణను నిర్ణయించాలని మంత్రి సూచించారు.

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మాట్లాడుతూ పరిశ్రమల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, భూకేటాయింపులు, రిజిస్ట్రేషన్, అనుమతులు, విద్యుత్ సరఫరా, నిర్మాణ పనులపై ప్రాజెక్టుల వారీగా స్పష్టమైన వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ సమస్యలను సర్వే నంబర్ వారీగా గుర్తించి సంబంధిత తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టు ప్రస్తుత స్థితి, ఇప్పటివరకు జరిగిన పురోగతి, పెండింగ్ అంశాలు, తదుపరి కార్యాచరణ వివరాలు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 22-ఏ నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించి భూస్వాములు మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆన్‌లైన్ అడంగల్‌లో భూముల వివరాల్లో లోపాలుంటే సర్వే నంబర్, సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకునేలా సూచించి, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్, ట్రస్ట్ భూములకు సంబంధించిన లీజు ప్రతిపాదనలను నిబంధనల మేరకు పరిశీలించి అవసరమైన అనుమతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ

కొత్తగా ఏర్పాటు కానున్న, ఇప్పటికే పనిచేస్తున్న పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల వివరాలను పరిశ్రమల ప్రతినిధుల నుంచి సేకరించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన ఉద్యోగ పోస్టులు, విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, శిక్షణా కోర్సుల వివరాలను అక్టోబర్ 15లోగా లిఖితపూర్వకంగా అందించాలని పరిశ్రమల ప్రతినిధులను కోరారు.

అందిన వివరాల ఆధారంగా ఐటీఐలు, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు, స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు చదువుకునే సమయంలోనే పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అభ్యసించేలా శిక్షణా కార్యక్రమాల్లో అవసరమైన అంశాలను చేర్చాలని సూచించారు.

పరిశ్రమల ప్రతినిధులు తమకు ఎదురవుతున్న ఎండోమెంట్, వక్ఫ్ భూముల లీజులు, 22-ఏ భూముల సమస్యలు, బ్లాస్టింగ్, భూముల అధిక ధరలు తదితర సమస్యలను నేరుగా జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని డాక్టర్ ఏ. సిరి కోరారు. సమస్యలను ప్రారంభ దశలోనే అధికారుల దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జీఎం డీఐసీ సంజీవరాజు, జెడ్ఎం మధుసూదన్ రెడ్డి, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వీరేంద్ర, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు

నిర్వహించిన నవజీవన్ బధిరుల పాఠశాల -. ఆకట్టుకున్న బధిర బాలల సాంస్కృతిక ప్రదర్శనలు

బధిరులు తమ వైకల్యాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో జీవితంలో ఎదగాలి: డాక్టర్ రవి కృష్ణ.

నంద్యాల సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్) :
శనివారం స్థానిక ఆయ్యలూరు మెట్ట వద్ద ఉన్న నవజీవన్ బధిరుల ప్రత్యేక పాఠశాల లో అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నవజీవన్ బధిరుల పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జాన్ మేరీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు, లయన్స్ అంతర్జాతీయ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బధిర బాలలు తమ వైకల్యాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో జీవితంలో విజయాలు సాధించాలని కోరారు. చదువుతోపాటు క్రీడల్లో,సాంస్కృతిక కళలలో పాల్గొని విజయాలు సాధించాలని, బధిరుల కోసం జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అనేక క్రీడా పోటీలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు దివ్యాంగులకు జీవితంలో పైకి ఎదగడానికి ప్రస్తుతం అన్ని రకాల తోడ్పాటు అందిస్తున్నారని,రాష్ట్ర ప్రభుత్వం 6000 రూపాయల నెలవారీ పెన్షన్ అందించడమే కాకుండా, ప్రత్యేక విద్యాసంస్థలు నెలకొల్పుతున్నారని, ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించి ప్రోత్సహిస్తున్నారని , స్వచ్ఛంద సంస్థలు వారు విజయం సాధించడంలో సహాయ సహకారాలు అందించడానికి



ముందుకు వస్తున్నారని, బధిర విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం క్రీడా పరికరాలు అందించడమే కాకుండా అవసరమైన ఇతర సహాయ సహకారాలను నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం, లయన్స్ క్లబ్, ఐఎంఏ తరఫున అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా బధిర బాలలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాట, సంగీతం వినిపించక పోయినప్పటికీ, సంగీతానికి అనుగుణంగా, డాన్స్ టీచర్ సంజ్ఞలతో ఇచ్చే సూచనలతో చక్కటి నృత్య ప్రదర్శనలు చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో నవజీవన్ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జాన్ మేరీ, హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మావతమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఇతర అధ్యాపక బృందం పాఠశాలలో చదువుకుంటున్న బధిర బాలలు పాల్గొన్నారు.

కనిపించకుండా పోయిన పసికందును సురక్షితంగా రక్షించిన వ్యక్తి

నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ సుస్మిత



నంద్యాల క్రైం, సెప్టెంబర్ 26, (రిపబ్లిక్ న్యూస్): మండల పరిధిలోని అయ్యలూరు మెట్ట సమీపంలో ఒక మహిళ తన సుమారు ఒక నెల వయస్సు గల పసికందుతో కలిసి కనిపించకుండా పోయినది. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి, మహిళ, పసికందు ఆచూకీ కోసం వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో అయ్యలూరుమెట్ట నుండి పెద్దకొట్టాల గ్రామానికి వెళ్లే మార్గంలో రహదారికి వెలుపల ఉన్న చెట్ల పొదల్లో సుమారు ఒక నెల వయస్సు గల శిశువు కనిపించింది. అటుగా వెళుతున్న ఒక వ్యక్తి శిశువును గుర్తించి, వెంటనే ఆమెను రక్షించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని శిశువును సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శిశువును ఆమె తండ్రి కేడెం శివ నాగరాజుకు చూపించగా, ఆయన తన కుమార్తెగా గుర్తించారు. శిశువు తల్లి కేడెం స్పందన ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మాట్లాడలేని స్థితిలో ఉన్నందున, శిశువు అక్కడికి ఎలా చేరుకుంది, ఎందుకు అక్కడ వదిలివేయబడింది అనే పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ విషయంపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. శిశువును గుర్తించి, సకాలంలో రక్షించి పోలీసులకు సమాచారం అందించిన వ్యక్తి చూపిన సమయస్ఫూర్తి, మానవతా దృక్పథం, బాధ్యతాయుతమైన ప్రవర్తనను నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ సుస్మిత అభినందించారు. సదరు వ్యక్తిని సత్కరించి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. పసికందు సురక్షితంగా లభించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు, శిశువును రక్షించిన వ్యక్తికి కృతజ్ఞతలు తెలిపారు.

విపత్తు నిర్వహణ, ముందస్తు చర్యలపై సమీక్షించిన జిల్లా జాయింట్ కలెక్టర్.

సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనంజయ్.

నంద్యాల, సెప్టెంబర్,26(రిపబ్లిక్ న్యూస్)
వర్షాకాలం, రాబోయే సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అవసరమైన విపత్తు నివారణ చర్యలు చేపట్టాలని జాయింట్ సూరజ్ ధనంజయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు అడిషనల్ ఎస్పీ సుస్మిత స్వామినాథన్, డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీవోలు, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, ఆరోగ్య తదితర శాఖల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ విపత్తు నిర్వహణ, ముందస్తు చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ...వర్షాకాలం, రాబోయే సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు, సమస్యాత్మక ప్రాంతాలు, అవసరమైన నిధులు, ప్రభుత్వానికి పంపాల్సిన ప్రతిపాదనలపై సమీక్షిస్తూ....కెనాల్ గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణమే అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్న ప్రాంతాల్లో కరకట్టల పటిష్టత, సైడ్ లైనింగ్ పనులపై సమగ్ర నివేదిక అందించాలని సూచించారు. ప్రాజెక్టుల మెకానికల్ గేట్ల పనితీరును క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.





జిల్లాలోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కాజ్‌వేలు, ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ట్రాఫిక్ మళ్లింపు చర్యలు సిద్ధం చేయాలన్నారు. బలహీనంగా ఉన్న వంతెనలు, కాజ్‌వేల స్థానంలో అవసరమైన నూతన వంతెనలు, కాజ్‌వేల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వేసవి లేదా విపత్తు పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖలు వర్షాభావం, అనావృష్టికి గురయ్యే మండలాలు, తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పంటల రక్షణకు సంబంధించి రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని అన్నారు. విపత్తు అనంతరం పంట నష్టం, నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర అంశాలపై అంచనాలను వేగవంతం చేసేందుకు క్షేత్రస్థాయి బృందాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ముంపునకు గురయ్యే, సమస్యాత్మక గ్రామాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు, మెడికల్ క్యాంప్‌లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు క్లోరినేషన్ మాత్రలు, అవసరమైన మందులు, వైద్య సామగ్రిని తగినంతగా అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల పూర్తి వివరాలు, చేపట్టాల్సిన పనులు, అవసరమైన నిధులు, ప్రభుత్వానికి పంపాల్సిన ప్రతిపాదనలపై శాఖల వారీగా సమగ్ర నివేదికలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విపత్తు సంభవించిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రమాదాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ద్వారా నష్టం తీవ్రతను తగ్గించవచ్చని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

అనుమతి లేని ధర్నాలు, నిరసనలకు ప్రభుత్వ ఉద్యోగులు దూరంగా ఉండాలి

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు -జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్

నంద్యాల క్రైం, సెప్టెంబర్ 26, (రిపబ్లిక్ న్యూస్):
స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు విజయవాడలో నిర్వహించనున్నట్లు ప్రచారం జరుగుతున్న ధర్నా/నిరసన కార్యక్రమానికి ఎటువంటి అనుమతి లేదని నంద్యాల జిల్లా పోలీసు శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు అనుమతి లేని ధర్నాలు, నిరసనలు, ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనడం సంబంధిత ఆంధ్రప్రదేశ్ కండక్ట్ సర్వీస్ రూల్స్, అమలులో ఉన్న ఇతర నిబంధనలకు విరుద్ధంగా ఉండే అవకాశం ఉన్నందున, ఉద్యోగులు ఇటువంటి అనధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ సూచించారు. విజయవాడలో అనుమతి లేకుండా నిర్వహించే ధర్నా లేదా నిరసన కార్యక్రమాలపై పోలీసు శాఖ నిరంతరం నిఘా ఉంచుతుంది. అవసరమైన సందర్భాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరికరాల ద్వారా కార్యక్రమాల్లో పాల్గొనే వ్యక్తులను గుర్తించే చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు. పోలీసుల సూచనలు, అమలులో ఉన్న చట్టాలు, నిబంధనలను ఉల్లంఘిస్తూ అనధికారిక ఆందోళనల్లో పాల్గొనే వారిపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసు శాఖ హెచ్చరించింది. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిర్వర్తిస్తూ, అనుమతి లేని కార్యక్రమాలకు హాజరుకాకుండా సంయమనం పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com